25 . 11. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 176 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



ఈ నెల 26న జరుగనున్న తన కుమారుడు సూర్య ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ని స్వగృహంలో పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. హైదరాబాద్ వెలుతురు నవంబర్ 24:



## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు



## అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సిఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శ్రీకారం
- సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్







**కొడంగల్,నవంబరు 24(వెలుతురు):** మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నాననని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభ మవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్

- తెలంగాణ సచివాలయంలో లీకు వీరులు
- కీలక ప్రభుత్వ సమాచారాన్ని లీక్ చేస్తున్న కొందరు అధికారులు
- మంత్రుల కార్యాలయాలు, ఉన్నతాధికారుల ఛాంబర్లలో బ్లాక్ షీప్స్
- లీకు వీరుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారులు?
- సీఆర్ పాటిల్ లేఖ లీక్, HILTP పాలసీ జీవో లీక్ లతో కలకలం
- అధికారికంగా విడుదల కాకముందే ప్రతిపక్ష నేతల చేతుల్లోకి

హైదరాబాద్ వెలుతురు నవంబర్ 24:

## త్వరలోనే పంచాయితీ ఎన్నికలు

రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్

కొడంగల్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి



## నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ



**అయోధ్య,నవంబరు 24(వెలుతురు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యలో పర్యటించనున్నారు. ఇక్కడి రామ జన్మభూమి మందిర్‌ను దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై

## నేడు రూ. 300.40 కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ

- 3 లక్షల 50 మహిళా స్వయం సహాయక సంఘాలకు లబ్ధి,
- అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నేరుగా పంపిణీ,
- ఇందిరమ్మ చీరల నాణ్యతపై సర్వత్రా హర్షం,
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి



**హైదరాబాద్,నవంబర్24( వెలుతురు):** రాష్ట్రంలోని 3 లక్షల 50 మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 300.40 కోట్ల వడ్డీలేని రుణాలను రేపు పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలియచేసారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ చీరెల పంపిణీ పురోగతి, రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో వడ్డీలేని రుణాల పంపిణీ అంశంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సి.ఎస్ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర

## పత్తి దిగుబడి తక్కువైంది... కొనుగోలు పరిమాణాన్ని 9 క్వింటాళ్లకు పెంచండి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కు పత్తి రైతుల వినతి
- సంజయన్నా...దేవుడిచ్చిన అన్నవు నువ్వు
- మీ సాయం జన్మలో మర్చిపోలేను
- బండి సంజయ్ ను కలిసి కృతజ్ఞతలు తారవ్వ



**హుస్నాబాద్ వెలుతురు నవంబర్ 24:** పత్తి కొనుగోలు పరిమాణాన్ని 7 నుండి 9 క్వింటాళ్లకు పెంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పత్తి రైతులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈరోజు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చిన బండి సంజయ్ ను పత్తి రైతులు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. వాతావరణ పరిస్థితులు, నీటి సమస్యలు, మార్కెట్ అస్థిరతవల్ల తాము తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ తరుణంలో ఎకరాకు 7 క్వింటాళ్లను మాత్రమే పత్తిని కొనుగోలు చేసేలా సీసీఐ నిర్ధారించడంవల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పత్తి రైతుల సంక్షేమం కోసం చొరవ

## 29న దీక్షాదివస్‌ను విజయవంతం


- జిల్లా ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం
- బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిలుపు



**సూర్యాపేట,నవంబర్24( వెలుతురు):** ఈనెల 29న నిర్వహించనున్న దీక్ష దివాస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్యనేతలతో సన్నాహక సమావేశ నిర్వహించిన అనంతరం జగదీశ్ రెడ్డి

## బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

- కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మేంద్ర
- ఇటీవల బీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న ధర్మేంద్ర
- డిశ్చార్జ్ తర్వాత ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న బాలీవుడ్ నటుడు





## నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు

ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పార్టీకి చెడ్డపేరు

మాజీమంత్రిపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

**హైదరాబాద్,నవంబరు 24( వెలుతురు):** బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి


## కుటుంబం యూనిట్‌గా స్మార్ట్ కార్డు

అన్ని వివరాలతో అమలకు సన్నద్ధం

జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డు జారీ

ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు

అధజకారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు



**అమరావతి,నవంబర్24( వెలుతురు):** రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని సీఎం సూచించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌర సేవలు అందించా లన్నదే ప్రభుత్వ లక్ష్యం. కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు. సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పౌర సేవల్ని, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి పర్యవేక్షించాలని,

## బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం

- కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తాం
- 42శాతం ఇవ్వకుండా దేశమంతా రాహుల్ ప్రచారం
- రాహుల్ బిసి వ్యతిరేకతను ఢిల్లీలోనే ఎండగడతాం
- వచ్చే పార్లమెంటులో దీనిపై రాహుల్ చర్చించాలి
- బిఆర్ఎస్ నేతల సమావేశంలో కెటిఆర్ వెల్లడి



**హైదరాబాద్,నవంబర్24( వెలుతురు):** బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపై ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని అన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్

## ఏలూరు జిల్లాలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన పవన్ కల్యాణ్

- ఏలూరు జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు లాంఛనంగా ప్రారంభం
- గ్రామస్థులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్న పవన్
- సుందరగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

## బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

**హైదరాబాద్,నవంబరు 24( వెలుతురు):**

బాలీవుడ్ ప్రముఖ నటుడు ధర్మేంద్ర (89) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నేడు తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆయన ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నారు. డిశ్చార్జ్ అయ్యాక ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. 300కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన యాక్షన్ కింగ్‌గా, బాలీవుడ్ హీ-మ్యాన్‌గా గుర్తింపు పొందారు. భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత విజయవంతమైన నటులలో ధర్మేంద్ర ఒకరు. ఆరు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు వచ్చాయి. ధర్మేంద్రకు ఇద్దరు భార్యలు కాగా, ఒకరు ప్రకాశ్ కౌర్, మరొకరు హేమమాలిని. ఆయనకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఆయన సూపర్ హిట్ చిత్రాల్లో షోలే, ధరమ్ వీర్, సీతా ఔర్ గీతా, చుప్కే చుప్కే, గజబ్, దో దిశాయే, ఆంఖే, షికార్, ఆయా సావన్ ఝూమ్ కే, జీవన్ మృత్యు, మేరా గావ్ మేరా దేశ్, యాదోం కీ బారాత్ సహా మరెన్నో ఉన్నాయి. 1935 డిసెంబర్ 5వ తేదీన జన్మించిన ధర్మేంద్ర అసలు పేరు ధరమ్ సింగ్ డియోల్. సన్నీ డియోల్, బాబీ డియోల్, ఇషా డియోల్ ఆయన సంతానమే. 1960లో 'దిల్ భీ తేరా హమ్ భీ తేరా'తో ధర్మేంద్ర నటుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆయన చివరి చిత్రం 'ఇక్కీస్' త్వరలో విడుదల కానుంది. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి బీజేపీ ఎంపీగా గెలుపొందారు.

## నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు

చేసిన అవినీతికి వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బపడిందని వ్యాఖ్యలు చేశారు. ఆయన మూడు నాలుగు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని.. చెప్ప లేనంత అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మార్వో ఆఫీస్‌ను కాల్చేస్తే కూడా ప్రజలు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని.. ఎదురు తిరిగిన 32 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారంటూ మాజీ మంత్రిపై ఫైర్ అయ్యారు. ఇలాంటి అవినీతిపరుడిని చిత్తుగా ఓడించడం సరైన నిర్ణయమన్నారు. వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి రాచరిక పాలనను తలపించారని విమర్శించారు. ఒక్క ఎకరాకు కూడా నీళు ఇవ్వని నిరంజన్ రెడ్డి తనకు తాను నీళ్ల నిరంజనుడుగా పేరు మార్చుకున్నారంటూ ఎద్దేవా చేశారు. 'నా గురించి ఇంకొక్కసారి ఎక్కడైనా మాట్లాడితే నీ తాట తీస్తా ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకో' అంటూ నిరంజన్ రెడ్డికి కవిత ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

**న్యూఢిల్లీ,నవంబరు 24( వెలుతురు):**

భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్, కేంద్రమంత్రులు, ఇతరులు పాల్గొన్నారు.

## త్వరలోనే పంచాయితీ ఎన్నికలు

**కొడంగల్,నవంబర్24( వెలుతురు):**

రాష్ట్రంలో త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునేవాళ్లను ఈ ఎన్నికల్లో ఎన్నుకోవద్దని సూచించారు. అభివృద్ధి చేసే వారికే అండగా నిలవండి అని కోరారు.సర్పంచ్ ఎన్నికలు అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని మహిళలు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల కోసం రాజకీయాలను పక్కనబెట్టాలని సూచించారు. అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటే అని సంకేతమివ్వాలని సూచించారు. కొడంగల్‌లో పర్యటన సందర్భంగా అక్షయ పాత్ర కిచెన్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే రూ.103కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ప్లలె వెలుగు బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రూ.5వేల కోట్లతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తామని.. రాష్ట్రం నలుమూలల నుంచి చదువు కోసం కొడంగల్‌కు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఢిల్లీకి నోయిడా తరహాలో కొడంగల్ మారబోతోందని పేర్కొన్నారు.

## నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక-సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శు క్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మదవ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధ్యానం చేశారు. ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్టు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు

## పత్తి దిగుబడి తక్కువైంది...

## కొనుగోలు పరిమాణాన్ని 9 క్వింటాళ్లకు పెంచండి



తీసుకుని తక్షణమే సీసీఐ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఈ విషయంపై సీసీఐ అధికారులు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. మరోవైపు హుస్నాబాద్ ఆసుపత్రికి వచ్చిన బండి సంజయ్ ను ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పండించిన వడ్లన్నీ కొట్టుకుపోవడంతో కన్నీరు మున్నీరైన రైతు తారవ్వ కలిశారు. తారవ్వకు నష్టం జరిగిందని తెలిసిన వెంటనే బండి సంజయ్ ఆరోజు ఢిల్లీ నుండి తారవ్వకు ఫోన్ చేసి బాధపడొద్దని తక్షణ సాయంగా రూ.50 వేలు పంపిస్తున్నట్లు భరోసా ఇచ్చారు. ఆ మరుసటి రోజే బీజేపీ నేతల ద్వారా తారవ్వకు రూ.50 వేల సాయం అందించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ను కలిసిన తారవ్వ 'సంజయన్నా...దేవుడిచ్చిన అన్నవు నువ్వు. మీ సాయం జన్మలో మర్చిపోలేను. ఆరోజు పంట నష్టపోయి పుట్టెడు దు:ఖంలో ఉంటే ఫోన్ చేసి భరోసా ఇచ్చినవ్. సాయం చేసినవ్. నువ్వు నిండా నూరేళ్లు సల్లగా ఉండాలి."అని క్రుతజతలు తెలిపారు.

# అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం.త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళు ందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రామలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్లు మంజూరు చేయడం రైతులకు ఉపయోగకరంగా ఉండనుంది. ఈ మొత్తం ప్రాజెక్టులు కొడంగల్ నియోజకవర్గపు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో పెద్ద అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

## 29న దీక్షాదివస్‌ను విజయవంతం

మీడియాతో మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు నవంబర్ 29 అని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో.. అన్న నినాదమే ఉద్యమానికి ఊపిరి పోసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ఏర్పాటు సాధనలో ఆరోజే కీలకమని పేర్కొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్ర మెడలు వంచిందని జగదీశ్ రెడ్డి అన్నారు. ఆ దీక్షతోటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఉద్యమం ఉవ్వెత్తున లేచి.. అన్ని రంగాలు ఐక్యతతో కలిసి వచ్చినాయన్నారు. అందుకే ఆరోజు ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి దీక్షదివాస్‌కు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. రాష్టానికే ఆదర్శంగా సూర్యాపేటలో దీక్షదివాస్ ను నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు..కేవలం డబ్బు సంపాదనే రేవంత్ లక్ష్యమని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. అందుకే పెద్ద ఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని తెలిపారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్ కు కేటాయించిన భూముల్లో ప్రభుత్వ మోసం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కోకాపేటలో ఎకరం 100 నుంచి 170 కోట్లు వేలంలో విక్రయించినట్లు చెబుతున్న ప్రభుత్వం.. ఇప్పుడు అదే ప్రాంతంలో అతి తక్కువ ధరకు విక్రయించడంలో అర్థమేంటి అని ప్రశ్నించారు. ప్రజాధనం దోచుకోవడం పైనే రేవంత్ సర్కార్ దృష్టి పెట్టిందని జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూముల కుంభకోణంపై వచ్చే ప్రభుత్వంలో విచారణ తప్పదని హెచ్చరించారు. ప్రజల ప్రభుత్వ ఆస్తులను దోచుకున్న వారు ఎవరైనా వదిలిపెట్టమని స్పష్టం చేశారు. భూ కుంభకోణంలో సహకరించిన వాళ్లంతా జైలుకు వెళ్లక తప్పదని వార్నింగ్ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో చాలా గోల్ మాల్ జరుగుతుందని జగదీశ్ రెడ్డి అన్నారు. ఐకేపీ సెంటర్లలో సరిగ్గా ధాన్యం కొనడం లేదని తెలిపారు. మ్యాచర్ వస్తలేదని రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. దళారుల చేతుల్లో రైతులు తీవ్రంగా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ 2014 ముందున్న సమస్యలే తలెత్తుతున్నాయని అన్నారు. బీసీలను పెద్ద ఎత్తున మోసం చేసిన పార్టీ కూడా కాంగ్రెస్సే అని జగదీశ్ రెడ్డి విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చి విస్మరించిందని అన్నారు. తెలిసే మోసం చేసి.. తప్పించుకునేందుకు సాకులు వెతుకుతుందని అన్నారు. కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిన చందంగా ఉంది బీసీల పరిస్థితి అని విమర్శించారు. ఃఅ రిజర్వేషన్లు పెంచుతామని ఉన్న రిజర్వేషన్లు పోగొట్టుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకు అనేక చోట్ల ఃఅ లకు జీరో రిజర్వేషన్లు రావడమే నిదర్శనమని అన్నారు. బీసీల కోసం బీఆర్ఎస్ ఉద్యమిస్తదని జగదీశ్ రెడ్డి అన్నారు. బీసీలతో పాటు అన్ని రంగాల ప్రజల్లో కాంగ్రెస్ పై వ్యతిరేకత పెరిగిందని తెలిపారు. కేసీఆర్ ని వదులుకున్నామన్న భావన అందరిలో కలుగుతుందని అన్నారు. స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ విజయకేతనం తప్పదని స్పష్టం చేశారు.

# బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం

పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీలపై, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు బీసీలకు బ్జడెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బ్జడెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీ వర్గాలకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోని ఏ ఇతర ప్రభుత్వ చరిత్రలో ఎప్పుడూ చేసిన దాఖలాలు లేవని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.


ముఖ్యంగా కుల వృత్తులకు సహకారం అందించడం నుంచి మొదలుకొని విద్యారంగంలో ఏర్పాటుచేసిన విద్యా సంస్థల వరకు బీసీ వర్గాలకు కేసీఆర్ చేసిన మేలును తెలంగాణలోని బీసీలు గుర్తుంచుకున్నారని, వారంతా కేసీఆర్ వెంటే ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్.. కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో చేస్తున్న మోసంపై ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసాన్ని పార్టీ నేతలంతా ప్రజల్లోకి తీసుకువెళ్తారని తెలియజేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను త్వరలోనే పార్టీకి అందజేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన పవన్ కల్యాణ్

ఏలూరు నవంబర్24( **వెలుతురు**):

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో పాలనాపరమైన కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా, సోమవారం ఆయన ఏలూరు జిల్లాలో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కొయ్యలగూడెం, ద్వారకా తిరుమల మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న పవన్ కల్యాణ్‌కు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో నేరుగా సమావేశమై వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని, వెంటనే నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు పవన్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, పవన్ కల్యాణ్ ద్వారకా తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలోని ప్రసిద్ధ సుందరగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు, ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆలయ అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆవిష్కరించారు.ఈ పర్యటనలో భాగంగా, గ్రామం నుంచి సుందరగిరి వరకు నిర్మించనున్న రహదారి పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం, ఐఎస్ జగన్నాథపురంలో ఇటీవలే నిర్మించిన 'మ్యాజిక్ డ్రెయిన్ల' వ్యవస్థను పరిశీలించి, దాని పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పవన్





కల్యాణ్‌తో పాటు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు రూ. 300.40 కోట్ల వడ్డీలేని రుణాలన పంపిణీ

పంచాయితీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడవ విడత వడ్డీ లేని రుణాలను 25 వ తేదీ మంగళవారం నాడు ఉదయం 11 గంటలకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న ఈ వడ్డీ లేని రుణాలతో మహిళల్లో ఒక ధైర్యం, నమ్మకం, ఆత్మ విశ్వాసం ఏర్పడిందని అన్నారు. ఈ వడ్డీ లేని రుణాల మొత్తం నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నందున ఎవరెవరికి ఎంత మొత్తం అందిందో సభ్యులకు స్పష్టంగా తెలియ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమ అద్భుతంగా సాగుతోందని, ఈ చీరాల నాణ్యత, డిజైన్ల పట్ల మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, తమకి నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందించడం పట్ల రాష్ట్రం లోని మహిళలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నాణ్యమైన చీరాలను అందచేయడంతో పాటు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను కూడా అందించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, జిల్లాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీని వేగవంతంగా పంపిణీ చేయడంపట్ల జిల్లా కలెక్టర్లను అభినందించారు. త్వరితగతిన ఈ చీరలను పూర్తిగా పంపిణీ చేయాలనీ ఆదేశించారు. రేపు, మంగళవారం అన్ని నియోజక వర్గాల్లో నిర్వహించే వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి సంబంధిత జిల్లాల ఇంచార్జి మంత్రులు, జిల్లా నుండి ప్రాతినిధ్య వహించే మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్స్ నిధులు విడుదల చేయడం జరిగిందని, ఈ స్కాలర్షిప్స్ లను సమర్థవంతంగా పంపిణీ చేయడాని మీ జిల్లాల్లో వెల్ఫేర్ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జ్యోతి బుద్దా ప్రకాష్, హౌసింగ్ ఎం.డి గౌతమ్, సెర్ప్ సి.ఈ.ఓ దివ్య, పంచాయితీ రాజ్ కమీషనర్ సృజన లు పాల్గొన్నారు.

# గౌరవెల్లి సహా.. తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వండి..

**- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శిని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్..**



**వెలుతురు నవంబర్ 24, న్యూఢిల్లీ:**
తెలంగాణలో గౌరవెల్లి సహా.. ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని.. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శి తన్మయికుమార్‌ను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సెక్రెటరీ కోఆర్డినేషన్ డా.గౌరవ్ ఉప్పల్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్.. ఢిల్లీలో తన్మయికుమార్‌ను కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన అనుమతులపై చర్చించారు. సుప్రీంకోర్టు ధర్మాసనం మే 2025లో ఇచ్చిన 'వనశక్తి' తీర్పును ఇటీవల వెనక్కి తీసుకుందని.. దీనిపై న్యాయసలహా తీసుకొని.. అనుమతుల మంజూరు చేస్తామని తన్మయికుమార్ చెప్పినట్టు మంత్రి వివరించారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే.. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని కార్యదర్శికి వివరించినట్టు మంత్రి తెలిపారు. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ విదేశాల్లో ఉన్న కారణంగా.. తన్మయికుమార్‌ను కలిసి.. ప్రాజెక్టుల అనుమతుల గురించి చర్చించినట్టు చెప్పారు.

# ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

**- కీలక సమాచారం రాబట్టిన పోలీసులు**

**హైదరాబాద్,నవంబరు 24( వెలుతురు):**
ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. రవి వెబ్ సైట్, డొమైన్ నెట్ వర్క్, ఐపీ మాస్కులతో పాటు అన్నింటిపై పోలీసులు ఆరా తీశారు. 20 కోట్ల రూపాయల లావాదేవీలపై బ్యాంకు అధికారుల సహకారంతో బదిలీ వివరాలు తెప్పించుకుని మరీ పోలీసులు రవిని ప్రశ్నించారు. రవి స్నేహితులు, చె÷–లలెలు చంద్రిక వ్యవహారంపై వివరాలు సేకరించారు. రవి, అతడి స్నేహితుడు కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్, వీపీఎన్, ఐపీ మాస్కింగ్ వంటి అంశాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీలు జరిగినట్లు తేలింది. క్రిఎ÷–టో ద్వారా అమౌంట్ బదిలీ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. 1లీశి।బి యాప్ మాత్రమే కాకుండా ఇతర యాప్‌ల ద్వారా కూడా డబ్బులు సంపాదించినట్లు తేలింది. పోలీసుల ప్రశ్నలకు 'నేను ఒక్కడినే అన్ని చేశాను. నా వెనుక ఎవరూ లేరు'అని రవి చెప్పినట్లు సమాచారం. రవి కస్టడీకి సంబంధించి మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు నమోదు అయ్యాయి. మిగతా కేసుల్లో సైబర్ క్రైమ్ పోలీసులు పిట్ వారెంట్ దాఖలు చేశారు. పలువురు నిర్మాతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపనున్నారు. పిట్ వారెంట్ ద్వారా మరోసారి విచారణకు సిద్ధమవుతున్నారు.

## అధికారిక వాహనం వదిలిన మాజీ సిజెఐ గవాయ్



**న్యూఢిల్లీ,నవంబరు 24( వెలుతురు):**
సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేసారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ తాను వచ్చిన అధికారిక కారును కొత్త సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. నిబంధనల ప్రకారం సీజేఐగా పదవీవిరమణ చేసిన అనంతరం మాజీ సీజేఐలు తాము ఉంటున్న అధికారిక నివాసాలను, సీజేఐకి ప్రభుత్వం ఇచ్చే ఇతర సౌకర్యాలను వీడాల్సి ఉంటుంది. అందులోభాగంగానే జస్టిస్ గవాయ్ కారును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. అయితే జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జస్టిస్ గవాయ్ కారును అక్కడే వదిలివేయడం గమనార్హం. ఈ ఏడాది మే 14వ తేదీన 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ముగియడంతో సోమవారం నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేశారు.

# టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం డీసీసీ అధ్యక్షుల నియామకంపై అభినందనలు



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 24:**
తెలంగాణలో తాజాగా నియమితులైన అన్ని డీసీసీ అధ్యక్షులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ నియామకాలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి కొత్త శక్తిని, ఐక్యతను, క్రమశిక్షణను తీసుకువచ్చే కీలక ముందడుగు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దూర దృష్టి కలిగిన నాయకత్వం పార్టీకి ప్రస్తుతం అభివృద్ధి దిశగా మార్గనిర్దేశం చేస్తోంది. సీనియారిటీకి గౌరవం ఇవ్వడం, సామాజిక న్యాయం ఆధారంగా ప్రాతినిధ్యం కల్పించడం, పార్టీ అంతర్గత సామరస్యాన్ని కాపాడుతూ సమతుల్య నిర్ణయాలు తీసుకోవడం ఇవన్నీ వారి నాయకత్వానికి నిజమైన నిదర్శనం. మహేష్ గౌడ్ పారదర్శక, న్యాయపరమైన, ప్రతిభను ప్రోత్సహించే నిర్ణయాలు ప్రతి సీనియర్ నాయకుడికి సముచిత గౌరవం, గుర్తింపు అందేలా చేశాయి.

ఈ సమగ్రతతో కూడిన ఆర్గనైజేషనల్ రీబిల్డింగ్ తెలంగాణ కాంగ్రెస్ కుటుంబంలో కొత్త నమ్మకాన్ని, ఉత్సాహాన్ని నింపుతోంది. కొత్తగా నియమితులైన డీసీసీ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి తమ వంతు పాత్ర పోషించి, ప్రతి స్థాయిలో కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పరిపక్వత కలిగిన నాయకత్వానికి, సమన్వయ వైఖరికి, పార్టీని బలోపేతం చేయడంలో పెట్టే కృషికి హృదయపూర్వక అభినందనలు.



**డా. రేఖ బోయలపల్లి**
తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు

# స్వయం సహాయక మహిళా సంఘాలకు శుభవార్త

**- రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం**
**- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సీతక్క**





**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 24:**
స్వయం సహాయక మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు ప్రభుత్వము జమ చేసింది. మొత్తం 3,57,098 సంఘాలకు ఈ నిధులు చేరాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క.. సెర్ప్ సీఈఓ దివ్యాదేవరాజన్, జిల్లా డిఆర్డిఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క ఏటూరునాగారం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లకు తగ్గకుండా మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ, వాటికి వడ్డీ భారం లేకుండా ప్రభుత్వం తరపునే వడ్డీలను చెల్లించడం కొనసాగుతోందని తెలిపారు. తాజాగా రూ.304 కోట్ల వడ్డీలను చెల్లించినట్టు పేర్కొన్నారు. దీంతో ఇప్పటివరకు గ్రామీణ సంఘాలకు రూ. 1,118 కోట్ల వడ్డీ రహిత రుణాలు చేరాయన్నారు. ఇవి కాకుండా పట్టణ మహిళా సంఘాలకు సుమారు రూ. 300 కోట్ల వడ్డీ లేని రుణాలను చెల్లించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని, ఆడబిడ్డల ఆర్థిక భద్రత కోసం వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తూ, వారి అభివృద్ధికి దారితీసే పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలపై వడ్డీల భారం లేకుండా ప్రభుత్వమే వాటిని భరిస్తోందని, మహిళల సాధికారతను శాశ్వతంగా నిలబెట్టే విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు చెల్లించాల్సిన రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందని, స్వయం సహాయక మహిళలు కష్టపడి పొదుపుగా పెట్టుకున్న అభయహస్తం నిధులను కూడా కాజేసిందని గుర్తు చేశారు. మహిళల కష్టాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కే లేదని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు నిధులను పారదర్శకంగా, సకాలంలో అందిస్తూ వారి ఆర్థిక శక్తిని మరింతగా పెంచే దిశగా కృతనిశ్చయంతో పనిచేస్తుందని తెలిపారు.

# విలీనం ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 24:**
ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన పలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. సోమవారం ఆదిలాబాద్ లోని అనుకుంటా గ్రామంలో ఇందిరమ్మ జిల్లా గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి జూపల్లి, ఎంపీ గోడం నగేష్ గారితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కలిసి ఇందిరమ్మ







గృహప్రవేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... అనుకుంటా గ్రామం ఓ చైతన్యవంతమైన గ్రామమని మున్సిపాలిటీలో విలీనం అయితే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశపడ్డారని, అందుచేతనే విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మంత్రి కోరారు. గతంలో దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒకే వేదికపై కూర్చోబెట్టి వెనుకబడ్డ ఆదిలాబాద్ అభివృద్ధికి కృషి చేయాలని వారిని కోరినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అనుకుంటా, బంగారు కూడా గ్రామానికి ఇప్పటికే 90 లక్షల నిధులతో పాటు ఇటీవల మరో 61 లక్షల నిధులు మంజూరయ్యాయని దీనికి ముఖ్యమంత్రి, ఇంచార్జీ మంత్రి గా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం ఎంపీ కృషి వల్ల ఆదిలాబాద్ కు ఎయిర్పోర్ట్ మంజూరు చేసిందని, ఎయిర్పోర్ట్ రాకతో మరింత అభివృద్ధి చెంది అవకాశము ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువు బిజెపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# తాష్కెంట్ పర్వతాల నుంచి స్లోవేకియాలోని మారుమూల గ్రామాల దాకా...

**ఐఎఫ్ఎఫ్ఐ 56వ ఎడిషన్‌లో వెండితెరపై అలరించిన మానవీయ కథలు**

**జ్ఞాపకాలు, వలసలతో ముడిపడిన మానవీయ కథలను హైలైట్ చేసిన ఉజ్బెక్, స్లోవేక్ సినిమాలు**

**గోవా వెలుతురు IFFIWood, 24 నవంబర్ 2025:** భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవ 56వ ఎడిషన్ ప్రపంచవ్యాప్తంగా గల శక్తిమంతమైన కథనాలను, విభిన్నమైన ప్రపంచస్థాయి సినిమాలను ప్రదర్శిస్తూనే ఉంది. అంతర్జాతీయ చిత్రాల్లో ఉజ్బెక్ చిత్రం ఇన్ పర్స్యూట్ ఆఫ్ స్ప్రింగ్, స్లోవాక్ చిత్రం ఫ్లడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.

సోమవారం రోజున నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ రెండు చిత్రాల దర్శక-నిర్మాతలు, నటీనటులు తమ చిత్ర రూపకల్పన ప్రయాణాల గురించి తమ అనుభవాలను పంచుకున్నారు.

స్లోవేక్ చిత్రం "ఫ్లడ్" నిర్మాత కటారినా క్రనాకోవా మాట్లాడుతూ... ఈ చిత్రం నీటి రిజర్వాయర్ నిర్మాణం కోసం ఒక గ్రామం వలస ఆధారంగా రూపొందించారు. స్లోవేకియాలోని మజోవా ప్రాంతంలో చిత్రీకరించిన ఈ చిత్రంలో దాదాపు 80 శాతం మంది తారాగణం రుథేనియన్ మైనారిటీ కమ్యూనిటీకి చెందినవారు. "ఈ చిత్రం వెండితెరపై వారి సొంత భాషలో ప్రదర్శన ఇచ్చే అరుదైన అవకాశాన్ని రుథేనియన్ కమ్యూనిటీకి అందించింది" అని ఆమె వ్యాఖ్యానించారు.

అర్జెంటీనాలో జరిగిన చలనచిత్రోత్సవంలో తొలి ప్రదర్శన తర్వాత ఈ ఫ్లడ్ చిత్రం ఐఎఫ్ఎఫ్ఐ గోవాలో రెండో ప్రపంచస్థాయి ప్రీమియర్‌ను ప్రదర్శించింది. నిజ జీవిత ప్రాజెక్ట్ ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం ద్వారా ఈ ప్రాజెక్ట్ ప్రభావిత కమ్యూనిటీల కోసం చిత్ర బృందం ప్రత్యేక స్క్రీనింగ్‌ను ప్లాన్ చేస్తోంది.

ఉజ్బెక్ చిత్రం "ఇన్ పర్స్యూట్ ఆఫ్ స్ప్రింగ్" తరఫున దర్శకుడు అయూబ్ షఖోబిద్దినోవ్, ప్రముఖ నటి ఫరీనా జుమావియాలు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని పరిచయం చేస్తూ... ఈ చిత్ర కథ ప్రధానంగా బాధాకరమైన జ్ఞాపకాలు, చాలా కాలంగా దాచి ఉంచిన రహస్యాలను చిత్ర ప్రధాన పాత్ర రహత్ షకురోవా ఎదుర్కొనే ప్రయాణాన్ని హృద్యంగా చూపిస్తుందని దర్శకుడు తెలిపారు. "గతం తిరిగి కళ్లముందుకు వచ్చినప్పుడు తనతో తాను సయోధ్య కోసం రాహత్ పాత గాయాలు, దాచిన సత్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆయన వివరించారు.

ఉజ్బెకిస్తాన్‌లో సోవియట్ శకం చివరి సంవత్సరాల్లో జరిగినప్పటికీ%ా% ఈ చిత్ర ఇతివృత్తాలు, భావోద్వేగ పోరాటాలు నేటికీ సంబంధితంగా ఉన్నాయి. చిత్రరూపకర్తలకు వారి ప్రతిభను ప్రదర్శించడానికి, ప్రపంచ నెట్‌వర్క్‌లను నిర్మించడానికి ఒక విలువైన అంతర్జాతీయ వేదికను ఐఎఫ్ఎఫ్ఐ అందిస్తున్నదని దర్శకుడు ప్రశంసించారు. "ఐఎఫ్ఎఫ్ఐలో భాగం కావడం మాకు సంతోషంగా ఉంది" అని ఆయన అన్నారు.



**సారాంశం:**

**ఇన్ పర్స్యూట్ ఆఫ్ స్ప్రింగ్**

తాష్కెంట్ నివాసి రహత్ షకురోవా తన గతంలోని ఒకరి మరణం గురించి తెలుసుకుని, ఒకప్పుడు తాను ఉపాధ్యాయురాలిగా పనిచేసిన మారుమూల పర్వత గ్రామమైన ఆర్కలీకి తిరిగి వస్తుంది. దశాబ్దాల క్రితం సోవియట్ యుగంలో అవమానం, బహిష్కరణకు దారితీసిన ఒక కుంభకోణంతో ఆమె జీవితం ఛిన్నాభిన్నమైంది. ఇప్పుడు ఆర్కలీకి తిరిగి వచ్చిన ఆమె... బాధాకరమైన జ్ఞాపకాలను, చాలా కాలంగా దాచి ఉంచిన రహస్యాలను ఎదుర్కోవలసి వస్తుంది. గతం తిరిగి బయటపడుతున్నప్పుడు, రాహత్ తనతో తాను సయోధ్య కోరుతూ పాత గాయాలు, దాచిన సత్యాల ద్వారా తన మార్గాన్ని అన్వేషించాల్సి వస్తుంది.

**సారాంశం:**

ఫ్లడ్ మారా స్వస్థలమైన లోయలోని గ్రామాల భవిష్యత్తు కొత్త నీటి రిజర్వాయర్ ప్రాజెక్టు ద్వారా ప్రశ్నార్థకం అవుతుంది. గ్రామస్తులంతా క్రమంగా తమ ఇళ్లను వదిలి వెళ్ళవలసి వస్తుంది. మారా గ్రామీణ ప్రాంతాలను వదిలి పట్టణంలో చదువుకోవాలని కోరుకుంటుంది. అయితే రుథేనియన్ రైతు అయిన ఆమె తండ్రి ఆమెను వారసత్వంగా వస్తున్న భూమిని సాగు చేయడంలో ఉంచాడు. అంతం సమీపిస్తున్నప్పటికీ అతను దానిని వదులుకోవడానికి నిరాకరించాడు. మౌలిక సదుపాయాల లేమి, అధికారుల నుంచి భయం, రాబోయే వరదలకు వ్యతిరేకంగా పోరాడుతున్న గ్రామ సమాజంలో మారా తనను తాను కనుగొంటుంది.


పీసీ లింక్:

**ఐఎఫ్ఎఫ్ఐ గురించి**

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం దక్షిణాసియాలోనే పురాతనమైన, అతిపెద్ద సినిమా వేడుకగా నిలుస్తుంది. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్... భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... గోవా రాష్ట్ర ప్రభుత్వం... గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ప్రపంచ సినిమాకు ప్రధాన కేంద్రంగా ఎదిగింది. ఇక్కడ అలనాటి అపురూప చిత్రాలు, సాహసోపేతమైన ప్రయోగాత్మక చిత్రాలు, లెజెండరీ మాస్ట్రోలు, నిర్భయంగా రూపొందించిన తొలి సినిమాలు ఒకే చోట కలిసి ఈ వేడుకలకు హాజరైన ప్రేక్షకులను అలరిస్తాయి. అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, ఘన నివాళులతో పాటు... ఆలోచనలు, ఒప్పందాలు, సహకారాలకు అపార అవకాశాలను అందించే శక్తిమంతమైన వేవ్స్ ఫిల్మ్ బజార్ వంటి కార్యక్రమాలు ఐఎఫ్ఎఫ్ఐని మరింత అద్భుత వేదికగా మార్చుతున్నాయి. నవంబర్ 20%-%28 వరకు అందమైన గోవా తీరప్రాంతంలో ప్రదర్శితమయ్యే 56వ ఎడిషన్.... ప్రపంచ వేదికపై భారత సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించే ఒక అద్భుతమైన వేడుకగా భాషలు, శైలులు, ఆవిష్కరణలు, స్వరాల అద్భుత సంగమంగా నిలుస్తుంది.

# సంపాదకీయం.. ఎస్సీల ఎదుగుదలకు అడ్డంకిగా క్రిమిలేయర్ !

ఎస్సీలలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీయ పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పుడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్దిని పొందుతున్నారు. దీంతో గత 75 ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీయ లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నాయి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూచించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమిలేయర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయినా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వం గా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, తెగల వారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన




పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశించిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరినవారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమీలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమిలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పుడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఓకుటుంబం తరాలుగా రిజర్వేషన్లను అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు. పన్న శ్రేణి అంటే క్రీమిలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ కావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించినట్లుగానే క్రిమిలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు. ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు. ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ం

ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేకపోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సిందు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుస్తూ రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని, ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదని అన్నారు. ఇది వాస్తవం. నిజానికి రిజర్వేషన్ల నిచ్చెనలు ఎక్కిన ఎందరో మిగతా ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న దాఖలాలు లేవు. అందువల్ల క్రీమిలేయర్ విధానం అమలు జరగాలి. ఒక కుటుంబానికి ఒకటి రెండుసార్లే రిజర్వేషన్లు అమలు కావాలి. అప్పుడే ఎస్సీలు సామాజికంగా ఎదుగగలరు.

## మరోమారు కుత్సిత బుద్ధిని చాటుకున్న చైనా

**- అరుణాచల్ యువతికి చైనాలో అవమానం**

**- పాస్‌పోర్ట్ ఉన్నా..చెల్లదని వేధింపులు**



**న్యూఢిల్లీ,నవంబర్24( వెలుతురు):**

చైనా మరోమారు తన కుత్సిత బుద్దిని చాటుకుంది. అరుణాచల్ తమదే అన్న వాదన కోసం ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. తాజాగా ఇలాంటి ఘటన కలకలం రేపింది. చైనాలో షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాదే అంటూ తన భారత పాస్‌పోర్ట్‌ను గుర్తించేందుకు ఆ దేశ అధికారులు నిరాకరించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనెల 21న పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనా నగరం షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. అందులో తాను పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ అని ఉందని వెల్లడించారు. అది చూసిన తర్వాత ఇమిగ్రేషన్ అధికారులు తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించారని ఆమె ఆరోపించారు. వారు ఆ ఈశాన్య రాష్ట్రాన్ని చైనాలో భాగమని పట్టుబట్టారన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనవైపు చూసి నవ్వారని, చైనీస్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారని ఆమె వాపోయారు. చెల్లుబాటు అయ్యే వీసా ఉన్నా కూడా తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారని, జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదని మీడియాకు వెల్లడించారు. తనను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారని, మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదని, చివరకు ఆహారం కొనేందుకు కూడా అంగీకరించలేదన్నారు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సహాయం అందిందని పేర్కొన్నారు. భారత అధికారుల సహాయంతోనే తాను అక్కడి నుంచి బయట పడినట్లు చెప్పారు. అలాగే దీనిపై తాను ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఇదంతా భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను అవమానించడమేనని ఆ లేఖలో అభివర్ణించారు. ఈ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ ప్రస్తుతం యూకేలో నివసిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పందనా రాలేదు.

## రూపాయి పతనంపై మండిపడ్డ కాంగ్రెస్

**- ఆనాటి విమర్శల వీడియోను పోస్ట్ చేసిన జైరామ్**

**న్యూఢిల్లీ,నవంబర్24( వెలుతురు):**

అమెరికా డాలర్‌తో పోలిస్తే.. రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది. శుక్రవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89 రూపాయలకి పడిపోయింది. రూపాయి విలువ రికార్డు స్థాయిలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడంతో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేసింది. 2013 యుపిఎ హయాంలో రూపాయి విలువ పడిపోవడంతో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో కాంగ్రెస్ కూడా మోడీపై మండిపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం పతనం అవుతూనే ఉంది. ఇప్పుడు అది 90 రూపాయల కనిష్ట స్థాయిని దాటబోతోంది. 2013 జూలైలో తాను చెప్పింది ప్రధానికి గుర్తుందా అని అప్పుడు మోడీ అన్న వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పోస్టు చేశారు. రూపాయి ఎంత వేగంగా పతనమవుతుందో చూడండి. కొన్నిసార్లు రూపాయి, ఢిల్లీలో ప్రభుత్వానికి మధ్య పోటీ జరుగుతున్నట్లు అనిపిస్తుంది. అయితే రూపాయి పతనంపై దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేసినా.. అలా అన్న వారి గౌరవం కూడా వేగంగా దిగజారిపోతుంది అని జైరాం రమేశ్ ఈ వీడియోకు జతగా పోస్టు చేశారు. 022 ఫిబ్రవరి 24వ తేదీన రూపాయి విలువ 99 రూపాయలకి పడిపోయింది. గత మూడు సంవత్సరాలుగా అత్యంత కనిష్ట స్థాయిలోనే రూపాయి విలువ పడిపోతుంది.


## కేంద్రం దెబ్బతో దిగివచ్చిన మావోలు

**- ఆయుధాలు వీడుతామని ప్రకటన**

**- కూంబింగ్ చర్యలు ఆపాలని షరతలు**

**విజయవాడ,నవంబర్24( వెలుతురు):**

వరుస ఎనకౌంటర్లు, లొంగుబాట్లు, ఆపరేషన్ కగార్‌ల నేపథ్యంలో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిజానికి 90శాతం దెబ్బతినట్లుగానే భావించాలి. ఈ క్రమంలో ఆయుధాలను వీడటంపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆ మూడు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది. దేశం, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ ఆయుధాలు త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మేం సమర్థిస్తున్నాం. కేంద్ర కమిటీ సభ్యులు సతీశ్ దాదా, చంద్రన్న ఇటీవల ఈ



నిర్ణయాన్ని సమర్థించారు. ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం తుపాకులను వదిలేయాలని భావిస్తోంది. అయితే మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం. ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు మా పార్టీ కట్టుబడి ఉన్నందున ఈ నిర్ణయాన్ని సమష్టిగా చేరుకునేందుకు మాకు కొంత సమయం పడుతుంది. మా సహచరులను సంప్రదించి పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాలు తెలియజేసేందుకు సమయం కావాలి. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. త్వరగా కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేయాలి. పీఎల్‌జీఏ వారోత్సవాన్ని నిర్వహించబోం. మా అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తామని హామీ ఇస్తున్నాంఅని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే అప్పటి నుంచి ఆయుధాలను వదిలేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బస్వరాజు ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ పునర్‌నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించి ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని లేఖలో పేర్కొంది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు సమాచారం ఇచ్చినట్టు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతాదళాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టు పార్టీ ఈ మేరకు లేఖను విడుదల చేసింది. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు, డీజీపీలు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా ఆయుధాలు వదిలేస్తామని మావోయిస్టు పార్టీ చెప్పింది. దీంతో ఈ లేఖపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నాయో చూడాల్సి ఉంది.

## కుటుంబం యూనిట్‌గా స్మార్ట్ కార్డు



వచ్చే ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న డేటా లేక్ ద్వారా సమాచార సేకరణ జరగాలి. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు వచ్చే ఏడాది జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలన్నారు. 25 రకాల వివరాలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలి.ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికం గా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలి. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలి. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలి. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దు. పౌరులకు చెందిన అన్ని వివరాలూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలి. ఈ ఒక్క కార్డు ద్వారానే అన్ని వివరాలూ తెలిసేలా రూపొందించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశర చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌తో కుటుంబం, వ్యక్తుల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు, పౌరసేవల పర్యవేక్షణకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఒక్కటే ఉంటుందని తెలిపారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగిం చాలని చంద్రబాబు సూచించారు. కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దని, పౌరులకు చెందిన అన్ని వివరాలనూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని ఆదేశించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌర సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా రూపొందించాలని చెప్పారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి జూన్‌లోగా కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొని ఆరుగురు దుర్మరణం

**చెన్నై,నవంబర్24( వెలుతురు):**

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తెనకాశీ-మదురై రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్రైవేటు బస్సులు ఒకదాన్నొకటి ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మదురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమ య్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికం గా నిర్ధరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌లను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగపుత్రుల జర్నలిస్ట్ లకు సన్మానం



**బషీర్ బాగ్ వెలుతురు 24 నవంబర్ :**
ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగపుత్రుల వల విసిరే పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కారుల సంక్షేమానికి కృషి చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గంగపుత్రుల కుల వృత్తి అన్యాక్రాంతం అవుతుందని, కుల వృత్తి కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలంగాణ గంగపుత్ర మహసభ అధ్యక్షుడు ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు బెస్త ఉపేందర్, మెట్టు శివలను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్




**బషీర్ బాగ్ వెలుతురు 24 నవంబర్ :**
హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహించిన జి.వెంకటస్వామి , అంజయ్య, పీజేఆర్ స్పూర్తితో నవీన్ యాదవ్ పని చేయాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నూతనంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపొందిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ నాంపల్లి లోని జన సమితి కార్యాలయంలో కోదండరాం ను కలిసి గెలుపుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ ను కోదండరాం సన్మానించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కొత్త తరం నాయకత్వం అవసరం ఉందని , అందుకు నవీన్ యాదవ్ గెలుపు నాంది అని కోదండరాం అన్నారు. తన గెలుపుకు కృషి చేసిన జన సమితి నాయకులకు నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంతో తో పాటు నగర అభివృద్ధితో కృషి చేస్తానని అన్నారు. వెంకటస్వామి , పీజేఆర్ తరహాలో బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

## ఆరుట్ల గౌడ సంఘం స్మశాన వాటిక స్థానాల గదుల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం చేసిన ఆరుట్ల గౌడ సంఘం సభ్యులు**



**మంచాల వెలుతురు నవంబర్ 24:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని గౌడ సంఘానికి సంబంధించిన స్మశాన వాటిక స్థానాల గదులకు రక్షణ లేకపోవడంతో ఆరుట్ల గౌడ సంఘం సభ్యులు అందరూ కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తొర్రూర్ క్యాంప్ కార్యాలయం వద్దకు వెళ్లి గౌడ సంఘం స్మశాన వాటిక స్థానాల గదుల రక్షణ కోసం ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి గౌడ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గౌడసంఘం స్మశాన వాటిక గదుల రక్షణ కోసం వారి గూడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తా అని హామీ ఇచ్చి వెంటనే డిఈ అధికారికి చెప్పడం జరిగింది ఈ సందర్భంగామావిన్న పాన్ని విని వెంటనే స్పందించిన ఎ మ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆరుట్ల మాజీ సర్పంచ్ సుంకరి పాండరీనాథ్ గౌడ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి గౌడ సంఘం సభ్యులు మారగోని సత్యనారాయణ గౌడ్ మద్దెల గోపాల్ గౌడ్ పాండాల యాదయ్య గౌడ్ చెరుకు నరసింహగౌడ్ అంతటి రాజుగౌడ్ మాధగోని జంగయ్యగౌడ్ మద్దెల రాజుగౌడ్ సుంకరి దానయ్యగౌడ్ మారగోని జంగయ్యగౌడ్ పాండాల శ్రీనివాస్ గౌడ్ ముద్దం జంగయ్యగౌడ్ బత్తుల రాజుగౌడ్ మారగోని శ్రీకాంత్ గౌడ్ నాయకులు చీమల జంగయ్య యాదవ్ ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ వెదిరె సికిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## హజ్ కమిటీ సభ్యుల శుభాకాంక్షలు.



**మేడిపల్లి వెలుతురు నవంబర్ 24:**
మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడిగా తోటకూర వజ్రెష్ యాదవ్ ఎంపికైన సందర్భంగా వారి నివాసంలో హజ్ కమిటీ సభ్యులు ముజీబ్,మజార్,మహ్మద్ యాకుబ్,ఖాదర్,యూసఫ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.మేడ్చల్ జిల్లాలో సామాజిక సేవతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో కొత్త అధ్యాయం ఆరంభమైన రోజుగా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

**- సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**- బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్**



**మంచాల వెలుతురు నవంబర్ 24:**
మంచాల మండల కేంద్రంలోని దండేటి కార్ సర్పంజి ఫంక్షన్ హాల్లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం జరిగింది ఈసమావేశంలో మండల అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ తొందర్లోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న తరుణంలో గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం ఏర్పడిందని అన్నారు రాబోవు సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు ఒక సైనికుల పనిచేసి మన అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసి మంచాల మండలంలో అత్యధిక స్థానాలు గెలిపించుకోవాలి అన్నారు రెండు సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో జరిగిన వైఫల్యాలను ప్రతి ఇంటికి గడపగడపకు వెళ్ళి వివరించాలని అన్నారు మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని స్థానిక సమరంలో దెబ్బ కొట్టాలని బిఆర్ఎస్ తో కలిసి వచ్చే అన్ని శక్తులను కలుపుకొని ముందుకు పోవాలని సూచించారు రేపటి నుండి ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ సమావేశాలు నిర్వహించుకోవాలి అందరూ కష్టపడి పార్టీ అభ్యర్థిని గెలిపించు కోవాలని అన్నారూ ఈకార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కాట్రోత్ బహదూర్ నాయక్ పీఏసిఎస్ మాజీ చైర్మన్ బస్సు పుల్లారెడ్డి మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్ బద్రీనాథ్ గుప్తా జంబుల కిషన్ రెడ్డి చిందం రఘుపతి నారి యాదయ్య రఘు నాయక్ రాజునాయక్ హరిప్రసాద్ ప్రకాష్ రెడ్డి ఆకారపు కృష్ణ సదానందం గౌడ్ మొగిలి వెంకటేశ్ అమరేందర్ రెడ్డి బత్తుల కిషన్ రెడ్డి బొట్టు ప్రవీణ్ దిలీప్ రెడ్డి అనిల్ నాయక్ శంకర్ జగదీష్ విజయ్ చంద్రమ్మ సాగర్ లాలూ శ్రీను రాజు నవాజ్ బొట్టు రమేష్ సపావట్ చిన్న తదిదరులు పాల్గొన్నారు

## బి.సి రిజర్వేషన్లను 42 శాతం నుండి 22 శాతం తగ్గింపును ఉపసంహరించుకోవాలి

**- ఆర్. కృష్ణయ్య**



**బషీర్ బాగ్ నవంబర్ 24 నవంబర్ :**
స్థానిక సంస్థలలో బి.సి రిజర్వేషన్లను 42 శాతం నుండి 22 శాతంకు తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని. లేకపోతె రాష్ట్రాలను అగ్ని గుండంగా మారుస్తామని 130 కుల సంఘాలు, 45 బి.సి సంఘాలు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొన్న క్యాబినెట్, స్థానిక సంస్థలలో బి.సి.ల రిజర్వేషన్లు 42 శాతం నుంచి 22 శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రకారం జారీ చేసిన జీవో 46ను రాష్ట్రంలో రెండు కోట్ల మంది బీసీలను మోసం చేయడం సరికాదన్నారు. గతంలో రెండు నెలల క్రితం 42 శాతం పెంచుతూ జీవో నెంబర్ 9 జారీ చేశారు. బీసీల కేసు హైకోర్టులో నడుస్తుంది. బీసీల వాదనలు వినిపించాలి. కేసు నడుస్తుంటే తీర్పు రాకముందే తగ్గిస్తూ జీవో నెంబర్ 42 ఎలా జారీ చేస్తారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను పచ్చి మోసం దగా చేస్తుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు పార్టీ ప్రతిపాదిక - పార్టీ ఎన్నికల గుర్తు ఉండదు. పార్టీ ప్రతి పాదికన 42 శాతం అని ఎలా అంటారు. ఇది మోసం కాదాని ప్రశ్నించారు. రిజర్వేషన్ల కేసు బలమైన పునాదులు రాజ్యాంగబద్ధంగా, చట్ట బద్దంగా, న్యాయబద్దంగా, జనాభా లెక్కలు ఉన్నాయన్నారు. బీహార్ ఎన్నికల వరకు ఆగి ఎన్నికల ఫలితాలు రాగానే అసలు నిజం రూపం కాంగ్రెస్ బయట పెట్టిందని ఆర్ కృష్ణ ద్వజమెత్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవో 46 లో ఉపసంహరించకుంటే మరో మారు బీసీలు ఉధృతంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. కార్యక్రమాన్ని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్ రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల రాములు యాదవ్, పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజ్ కుమార్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, పెరిక సంఘం అధ్యక్షులు విజయకుమార్, గౌడ సంఘం నాయకురాలు అనురాధ గౌడ్, వంశరాజ్ సంఘం మల్లేశం, విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు లాలకోట వెంకటాచారి, ఎంబీసీ సంఘం అధ్యక్షులు నిమ్మల వీరన్న, విద్యుత్ ఉద్యోగుల సంఘం కుమారస్వామి, కార్యదర్శి వెంకన్న గౌడ్, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం హనుమంత ముదిరాజ్, ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు కృష్ణ, బిసి పొలిటికల్ జేఏసి రాజునేత, తదితరులు పాల్గొన్నారు.

# మంచాలలో ఇందిరమ్మ చీరలు పంపిణీ

**- ప్రతి మహిళా కోటీశ్వరులు కావాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లక్ష్యం**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**మంచాల వెలుతురు నవంబర్ 24:**
మంచాల మండలం కేంద్రంలోని మల్లిఖార్జున పంక్షన్ హాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలు పం పిణీ చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అనంతరం మంచాల మండలం మహిళా సమైక్యకు ఆరుట్ల ఎస్ బి ఐ బ్యాంక్ ద్వారా14 కోట్ల 44లక్షల 45వేల రూపాయల చెక్కును డ్వాక్రా సంఘం మహిళలకు అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట నాసరికం చీరలు పంపిణీ చేసి మహిళలను మోసం చేసింది అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో నాణ్యమైన ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నాం అని అన్నారు మంచాల మండలంలో 13 వేల ఇందిరమ్మ చీరలు మహిళలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నా యన్నారు మహిళలకు పావలా వడ్డీ కే రుణాలు అందజేస్తున్నాం రాబోయే రోజుల్లో డ్వాక్రా సంఘాలు పెంచాలి అన్నారు మహిళల కోసం 100కోట్లు అయినా మంజూరు చేయిస్తా అని అన్నారు ప్రతి మహిళ కోటీశ్వరులు కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నాం అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కం బాలపల్లి గురునాథ్ రెడ్డి మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డిడైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ మంచాల తాసిల్దార్ వెంకట ప్రసాద్ మంచాల ఎంపీడీవో అన్నారం బాల శంకర్ ఏపీఎం చంద్రశేఖర్ గౌడ్ మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు మాజీ ఎంపీటీసీ లు ఎద్మ నరేందర్ రెడ్డి పల్నాటి జయనందం మాజీ సర్పంచ్ లు సుంకరి పాండరినాద్ గౌడ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి చీమల జంగయ్య యాదవ్ బైరక రమాకాంత్ రెడ్డి పాతులోత్ మంగ శ్రీనివాస్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్ మాజీ మండల అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ వింజమూరి ప్రేమకర్ రెడ్డి కొర్ర మొతి రాంనాయక్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు





## హిమాయత్ నగర్ డివిజన్లోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

**- జోనల్ కమిషనర్ రవి కిరణ్ ని కలసిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 24:**
హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ ని కలవడం జరిగింది, కలిసి హిమాయత్ నగర్ డివిజన్లోని అభివృద్ధి పనుల సీసీ రోడ్లు వివిధ ప్రాంతాలలో స్ట్రీట్ నెంబర్ 16 వాసవి పబ్లిక్ స్కూల్ లైన్, విట్టల్వాడిలోని శివాలయం నుండి నారాయణ కాలేజ్ వరకు, బాలాజీ స్వీట్స్ నుండి ప్రాక్సిస్ జిమ్ వరకు, కింగ్ కోటి హాస్పిటల్ ఆపోజిట్ లైన్ లో స్ట్రీట్ ఎండింగ్ వరకు, స్ట్రీట్ నెంబర్ 6 హిమాయత్ నగర్ సత్తి పల్లి అపార్ట్మెంట్ నుంచి స్ట్రీట్ నెంబర్ 6 డివిటి గోల్డ్ షాప్ వరకు, స్ట్రీట్ నెంబర్ 15 హిమాయత్ నగర్ గవర్నమెంట్ స్కూల్ నుండి దత్త నగర్ లోపలి వరకు, ఇంద్ర నగర్ బస్తీలో మరియు స్ట్రీట్ నెంబర్ 8 ధోబి గల్లీలో సీసీ రోడ్ల కొరకు లెటర్ ఇవ్వడం జరిగింది, ఈ యొక్క అభివృద్ధి పనుల కొరకు తొందరగా ఫండ్స్ శాంక్షన్ చేసి ఈ ఒక పనులు తొందరగా చేయించాలని కోరడం జరిగింది.



## జయరాం గురుస్వామిని కలిసిన శ్యాం ప్రసాద్ జీ



**రంగారెడ్డి జిల్లా వెలుతురు నవంబర్ 24:**
శ్యాం ప్రసాద్ సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల సందర్భంగా ఇంటింటికి తిరిగే కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తుంది. దానిలో భాగంగా సోమవారం రోజున మద్దిమడుగు పీఠాధిపతి హనుమాన్ దీక్ష వ్యవస్థాపకులు శ్రీశ్రీ కేతావత్ జయరాం గురుస్వామికి కరపత్రం ఇవ్వడం జరిగింది. దానిలో భాగంగా జిల్లా విభాగ్ కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, బాగ్ కన్వీనర్ డి శ్రీనివాస్ చారి, మరియు బిసి కుల సంఘాల ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వడ్డగోని అజయ్ గౌడ్, మరియు సామాజికవేత్త జగన్ పాల్గొనడం జరిగింది.

## దేవాలయ అభివృద్ధికి జూపల్లి భాస్కర్ రావు రూ.1.16 లక్షల విరాళం..



**వెలుతురు, చారకొండ నవంబర్ 24 :**
చారకొండ మండలంలోని జేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి వెల్దండ సింగిల్ విండో చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు రూ. 1.16 లక్షలు (1లక్ష 16వేల రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రావును శాలువతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నృపాల్ నాయక్, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయి కుమార్, మాజీ వార్డు సభ్యులు వెలిజాల వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు నిర్వాహకులు పోలీస్ వెంకట య్య, కిరణం షాపు వెంకటయ్య, లైన్ మెన్లు వెంకటయ్య, శ్రీనివాసులు ఆర్టీసీ సైదులు, రమే ష్, పరుశురాం, నరేందర్, గ్రామస్తులు, జూపల్లి భాస్కర్ రావు యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మేడి గోపాల్ దశదినకర్మలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు



**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 24:**
మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన మేడి గోపాల్ దశదినకర్మకు మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు జెట్టి సైదులు, రైతు విభాగం మండల అధ్యక్షుడు జంగిలి నరసింహ టిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కోళ్ల కిషన్ నాయకులు పోనుగుటి శ్రీనివాసరావు, బందెల నరసింహ, మేడి రాజు, బందెల లింగస్వామి, భైరబోయిన వీరస్వామి, మల్లె పోయిన వెంకన్న, మేడి యాదయ్య, కోళ్ల కిష్టయ్య, మేడి రామచంద్రం తదితరులు పాల్గొనడం జరిగింది.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీపీ , డయాబెటిక్ క్యాంపు నిర్వహణ



**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 24:**
ఉదయం 9 గంటలకు రామన్నపేట బస్ స్టాండ్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ రామన్నపేట ఆధ్వర్యంలో బీపీ మరియు డయాబెటిక్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఇందులో దాదాపుగా 100 సభ్యులకు రక్త పరీక్షలు గాని, బీపీ టెస్ట్ గాని చేయడం జరిగింది. ఇంకా చాలామంది కూడా టెస్ట్ చేయించుకోవడానికి వచ్చారు కానీ టైం మధ్యాహ్నం అవుతుంది. కనుక ఈ రోజు నిర్వహించలేకపోయాం. మరొక రోజు ప్రోగ్రాం చేసి టెస్టులు చేయాలని మా లైన్స్ మిత్రుడు చెప్పడం జరిగింది. ఈ డయాబెటిక్ క్యాంపుకు లైన్స్ క్లబ్ రామన్నపేట నుండి అధ్యక్షులు లయన్స్ గాలయ్య బోయ కార్యదర్శి లయన్స్ డాక్టర్ భాస్కరరావు పనకంటి మరియు గోవర్ధన చారి సూర్యనారాయణ, బొడ్డు వెంకటేశం, గుత్త నరసింహారెడ్డి, సురేందర్ రావు మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

## నామాపురం నుండి అంతంపేట వరకు రోడ్డు మరమ్మతులను ప్రారంభించిన- కంచుకట్ల సంపత్

**నామాపురం వెలుతురు నవంబర్ 24:**



గట్టుప్పల్ మండలం నామాపురం నుండి అంతంపేట వరకు రోడ్డు మరమ్మతులను ప్రారంభించిన మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ గతరెండు దశాబ్దాల కాలంగా రోడ్డు మొత్తం వర్షాలకు గుంతల మయమై రాకపోపులకు మరియు వర్షానికి గుంతలు ఏర్పడడంతో అనేక ఇబ్బందులను ఈరెండు గ్రామాల ప్రజలు ఎదుర్కొన్నారు ఎదుర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో అధిక వర్షాలకు రోడ్డుపైనే వర్షపు నీరు నిలవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులు వికలాంగులు అదే విధంగా బాటసారిలు అనేక ఇబ్బందులకు గురైన విషయాన్ని మీడియా ద్వారా స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు అభివృద్ధి ప్రదాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెరువుతో జాతీయ ఉపాధిహామీ పథకములో పదిలక్షల రూపాయలను మంజూరు చేయించినారు. ఇట్టి పనులను జెసిపి ద్వారా కంపచెట్లను తొలగించే పనులను ప్రారంభంతో రెండు గ్రామాల ప్రజలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ గట్టుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సుదర్శన్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖఅధ్యక్షులు జాజుల యాదయ్య, నామాపురం మాజీ మండల ప్రాదేశిక సభ్యులు భీమనపల్లి రాములు, కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం, మహాలక్ష్మి దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ చెనగోని యాదయ్య, చెనగోని సాయిలు, కంకణాల మధుకర్, ఐతరాజు యాదయ్య, వీరమల్ల లింగయ్య వీరమల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# దైవ భక్తిలో ఆయనకు ఆయనే సాటి ...

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట బీర్ల నివాసంలో భారీ ఎత్తున అయ్యప్ప స్వామి మహా పడిపూజ
- ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పలువురు ఉన్నతాధికారులు , ప్రముఖులు , విఐపి లు
- స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో మార్మోగిన యాదగిరిగుట్ట
- ఆధ్యాత్మిక వైభవంలో మునిగి తేలిన భక్తులు
- భక్తి పారవశ్యంలో మైమరచిపోయిన అయ్యప్ప స్వాములు , స్థానికులు
- ప్రతినిత్యం దైవ ఆరాధనలో మునిగితేలే పరమ భక్తుడు బీర్ల ఐలయ్య అంటూ స్థానికుల ప్రశంసలు
- భారీ ఎత్తున భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ
- ఇంత మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించిన బీర్ల ఐలయ్య అభినందనీయులు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రాష్ట్ర , దేశ ప్రజలు, ఆలేరు నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అయ్యప్పస్వామిని వేడుకున్నా : బీర్ల ఐలయ్య







**పుట్ట హనుమంత్**
**( సీనియర్ జర్నలిస్టు )**
**యాదగిరిగుట్ట, వెలుతురు ( నవంబర్ 24 )**
దైవభక్తిలో ఆయనకు ఆయనే సాటి... ఆయన మహా భక్తిపరుడు... సైదాపురం శ్రీ వీరభద్ర స్వామి వారు అంటే ఆయనకు ప్రాణం.... యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆయన నిత్యం కొలిచే దేవుడు... కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి ఆరాధనలో ఆయన ప్రతినిత్యం మైమరచిపోతుంటారు.... నిత్యం ఇటు దైవ ఆరాధనలో..ఆధ్యాత్మిక చింతనలో గడుపుతూనే ....అటు మరో వైపున ప్రజా ప్రతినిధిగా ప్రజల సేవలో ఆయన ముందుకు దూసుకుపోతుంటారు.... ఆయన మరెవరో కాదు... ఆయనే ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య...

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసం బీర్ల నిలయంలో భారీ ఎత్తున అత్యంత వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రముఖులు విఐపిలు హాజరయ్యారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే గల బీర్ల నివాసంలో ఈ మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించడంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. భారీ ఎత్తున హాజరైన అయ్యప్ప మాల ధారణ స్వాములు , సాధారణ భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున ఈ మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అటు విఐపి ల తాకిడితో పాటు ఇటు భక్తులు స్థానికులు మహా పడిపూజకు పోటెత్తడంతో మహా పడిపూజ జరుగుతున్న బీర్ల నివాస పరిసర ప్రాంతాలు పండుగ వాతావరణాన్ని , జాతరను తలపించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై మహా పడిపూజ కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉన్నారు. పడిపూజ కార్యక్రమం పూర్తయిన తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బీర్ల ఐలయ్య ఇంత మంచి ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందనీయులని అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంచి భక్తి పరుడని, దైవ నామస్మరణంలో నిత్యం ఆయన ముందుకు సాగుతూ, మరోవైపున ప్రజా ప్రతినిధిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన ప్రతినిత్యం కృషి చేస్తున్నారని అభినందించారు . ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిర్వహించిన ఈ మహా పడిపూజ కార్యక్రమం లో తాను కూడా పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు శాస్త్రోక్తంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి ప్రపత్తులతో అధ్యంతం అద్భుతంగా , కన్నుల పండుగగా ఈ మహా పడిపూజ కార్యక్రమం జరిగింది . అనంతరం అయ్యప్ప మాలధారణ స్వాములకు , భక్తులకు, స్థానికులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మంచి భక్తి పరుడని దైవచింతనాపరుడని పలువురు అభినందించారు. ఆయన ప్రతినిత్యం సైదాపురం శ్రీ వీరభద్ర స్వామి వారిని ఆరాధిస్తుంటారు. సోమవారం వచ్చిందంటే చాలు ఆయన సైదాపురం శ్రీ వీరభద్ర స్వామి వారి సేవలో మునిగితేలుతారు. అదేవిధంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని, కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రతినిత్యం ఆరాధిస్తూ పరమ భక్తుడిగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముందుకు సాగుతూ ఉంటారు. దీంతో పాటుగా ఆయన ప్రజా ప్రతినిధిగా ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆయన బలం దైవ బలమని, ఆయన ప్రతినిత్యం చేసే పూజలు, ఆయన నమ్ముకున్న దైవమే ఆయనకు మరింతగా శక్తిని ప్రసాదిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల లోటస్ టెంపుల్ పుష్కర వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా లోటస్ టెంపుల్ నిర్వాహకులు ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఆయన లోటస్ టెంపుల్ ని సందర్శించడమే కాకుండా మహా చండీయాగంలో పూర్తిస్థాయిలో పాల్గొని సుమారు మూడు నాలుగు గంటలకు పైగా లోటస్ టెంపుల్ లో దైవ ఆరాధనలో, ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. యాగం లో పాల్గొనడంతో పాటు మనిదీపేశ్వరీ అమ్మవారికి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు . ఇలా ఎక్కడ ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం, దైవ కార్యక్రమం జరిగినా బీర్ల ఐలయ్య పూర్తిస్థాయిలో దైవచింతనతో ఆ కార్యక్రమంలో గడుపుతుంటారు . అదేవిధంగా ఆయన ప్రతి సంవత్సరం మహా పడిపూజ కార్యక్రమం లాంటి ఆధ్యాత్మిక , దైవిక కార్యక్రమాలు అనేకం స్వయంగా నిర్వహిస్తుంటారు. దీంతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మహాభక్తిపరుడని దేవుడి ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉంటాయని పలువురు అంటుంటారు. ప్రజా బలంతో పాటు , ఆయన నమ్ముకున్న దేవుడి ఆశీస్సులతో ఆయన ప్రజాక్షేత్రంలో దూసుకుపోతున్నారని పలువురు చెబుతుంటారు. సోమవారం బీర్ల నిలయంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు తనకు ఆనందంగా ఉందని అన్నారు. ఇంత మంది అయ్యప్ప స్వాములు వచ్చి తమను ఆశీర్వదించడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర, దేశ ప్రజలు ఆలేరు నియోజకవర్గం మంచి వర్షాలతో పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అయ్యప్పస్వామిని వేడుకున్నానని ఆయన ప్రకటించారు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణం లో అంగరంగ వైభవంగా విజయవంతమైనది. అయ్యప్ప మాలధారణ స్వాములు , భక్తులు స్థానికులతో బీర్ల నిలయం పరిసర ప్రాంతాలు జాతర వాతావరణాన్ని తలపించాయి.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ దే విజయం

**- బి ఆర్ ఎస్ యాదగిరిగుట్ట సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి**

**యాదగిరిగుట్ట , వెలుతురు ( నవంబర్ 24 )**
స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని యాదగిరిగుట్ట బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి అన్నారు . సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని అన్నారు . కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని , ఆ ప్రభుత్వాన్ని గమనిస్తున్నారని, స్థానిక ఎన్నికల్లో



ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కెసిఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా ఉండాలని రాష్ట్రంలోని ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంపై తాము బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు. అదేవిధంగా యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో ప్రజా సమస్యలపై తాము నిరంతరం పోరాటం చేస్తున్నామని అన్నారు . పాతగుట్ట రోడ్డు బాధితులకు తాము నిరంతరం అండగా ఉంటామని , ప్రతి రోడ్డు బాధితుడికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని అన్నారు . పాతగుట్ట రోడ్డు బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్డు బాధితులకు అన్యాయం చేయాలని చూస్తే బిఆర్ఎస్ పార్టీ సహించబోదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని అన్నారు. ప్రజల కోసం ప్రతినిత్యం పోరాడుతూ, ప్రతిక్షణం ప్రజాక్షేత్రంలో ఉంటున్నామని అన్నారు. తమకూ తమ పార్టీకి ప్రజల మద్దతు పూర్తిస్థాయిలో ఉందని అన్నారు. ప్రజలకు అండగా నిలబడే ఏకైక పార్టీ బిఆర్ఎస్ అని స్పష్టం చేశారు.

# రాజకీయ కారణాలతో కాంటా అయిన ధాన్యాన్ని వెనక్కి పంపిన మిల్లు యాజమాన్యం, స్పందించని అధికారులు....

**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 24:**
మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన మందడి సాగర్ రెడ్డి, అతని సోదరుడు తమ వ్యవసాయ క్షేత్రంలో పండించిన వరి ధాన్యమును, అప్పటి అకాల వర్షాల వల్ల, తమ అనారోగ్యరిత్యా, గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకు రాలేక, ధాన్యం కొనుగోలు కేంద్రంలో స్థలాభావ కారణాన, జిల్లా కలెక్టర్ కూడా అప్పటి అకాల వర్షాల దృష్ట్యా తమకు వీలున్న ప్రదేశంలో ధాన్యం ఆరబెట్టుకోవచ్చుని మౌఖిక ఆదేశాలు జారీ చేయడం వల్ల, తమ ఊరికి ఆనుకుని ఉన్న వెంచర్ లో తమ వరి ధాన్యం ను ఆరబెట్టుకొని, తమ పేర్లను కూడా సీరియల్ లిస్ట్ లో నమోదు చేయించుకున్నారు. కొందరు రైతులు కూడా వారితో పాటే అదే స్థలంలో తమధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు.పిఏసిఎస్ చైర్మన్ తో రైతు సాగర్ రెడ్డి మాట్లాడి, వారి ఆదేశాలతో శేఖర్ అనే వ్యక్తికి చెప్పి ధాన్యం తేమ శాతమును వ్యవసాయ శాఖ అధికారులతో చూపించి, ధృవీకరింపచేసి, వారి నమోదిత వరుస సంఖ్య ప్రకారం గోనె బస్తాలు తెప్పించి కాంటా వేసి, ట్రక్ షీట్ ఇచ్చి మిల్లుకు పంపించిన తర్వాత, మిల్లు యాజమాన్యం వడ్లు దించుకోవడానికి నిరాకరించడం జరిగింది. మళ్ళీ అదే ధాన్యాన్ని లారీల్లో తీసుకు వచ్చి, ఎక్కడైతే కాంటా వేశారో, అక్కడే దించేశారు. నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్నా వడ్లు ఎందుకు దించుకోవడం లేదని ప్రశ్నించగా, పైనుండి ఒత్తిడి ఉంది, బిఆర్ఎస్ పార్టీ నాయకుల పంట దించుకోవద్దని చెప్పారు అనే సమాధానం మిల్లు నిర్వాహకులు ఇవ్వడంతో మందడి సాగర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కు ఫోన్ కాల్ ద్వారా సంప్రదించగా వారి నుండి స్పందన కరువైంది. సివిల్ సప్లై డిస్ట్రిక్ట్ మేనేజర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి దీనిపై వివరణ కోరారు. అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడిలతో వివక్షకు పాల్పడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ రైతుల పంట స్వీకరణలో ఆటంకాలు సృష్టించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. రైతు పండించిన పంటకు హక్కుగా లభించాల్సిన పంట కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థలాభావం వల్ల, అందరూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తమ ధాన్యం తేలేక, ముందస్తు అనుమతులతో వేరే స్థలంలో ధాన్యం ఆరబెట్టుకోవడానికి అవకాశం కలిపించాలని, దీని వల్ల స్థలాభావ ఇబ్బందులు ఉండవని, ధాన్యం ఆరబెట్టడం, ధాన్యం కొనుగోల్లు, త్వరగా, వేగంగా పూర్తి అవుతాయని, ఇలా వ్యక్తిగత కారణాలతో సామాన్య రైతులను ఇబ్బందులకు గురి చేయడం బాగా లేదని, వీరి లాగా ఎందరో రైతులు అకాల వర్షాల కారణాన వేరే స్థలాల్లో ధాన్యం ఆరబెట్టుకున్నారని, వారందరూ ఇబ్బందులకు గురవుతారని మండలంలోని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# మంత్రిని సత్కరించిన కాంగ్రెస్ నేత దుంబాల వెంకటరెడ్డి

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్న మంత్రి
- నాయకులు , కార్యకర్తలం కలిసికట్టుగా ముందుకు సాగి విజయం సాధిస్తామని మంత్రి కి హామీ ఇచ్చిన నేతలు



**యాదగిరిగుట్ట , వెలుతురు ( నవంబర్ 24 )**

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దుంబాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాలు , పూలమాలతో ఘనంగా సత్కరించారు. సోమవారం రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నివాసంలో జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సైదాపురం నాయకులు దుంబాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి వారికి పలు సూచనలు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి, అదే విధంగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే జడ్పిటిసి , ఎంపిటిసి అభ్యర్థుల విజయానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దుంబాల వెంకటరెడ్డి మంత్రికి తెలిపారు . స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలం అంతా కలిసికట్టుగా కృషి చేస్తామని వారు మంత్రికి హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని దుంబాల వెంకటరెడ్డి అన్నారు.

## తాటిపాముల సర్పంచ్ రేసులో కోల రమేష్ గౌడ్



**తాటిపాముల వెలుతురు నవంబర్ 24:**

సర్పంచి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కాగానే మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. అభ్యర్థుల కసరత్తులు వేగం పుంజుకున్నాయి. స్థానాలు రిజర్వేషన్ ఆధారంగా ఖరారవడంతో ప్రతి గ్రామంలో సామాజిక వర్గాల సమీకరణలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. పోటీదారుల సంఖ్య ఈసారి భారీగా ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాటిపాముల గ్రామం రాజకీయంగా ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తోంది. గ్రామ సర్పంచ్ ఎన్నికల బరిలో కోల రమేష్ గౌడ్ నిలవనున్నారన్న వార్తలు హాట్ టాపిక్ గా మారాయి. జర్నలిస్టుగా పనిచేస్తూ సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రమేష్ గౌడ్ గ్రామాభివృద్ధిపై ఎప్పటికప్పుడు స్వరం వినిపిస్తూ ఉండటం ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రమేష్ గౌడ్ ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువతకు అవకాశాలు, సామాజిక ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై రమేష్ గౌడ్ దృష్టిసారిస్తారని ఆయన సన్నిహితులు అభిప్రాయం. రమేష్ గౌడ్ సర్పంచ్ ఎన్నికల బరిలో దిగితే పోటీ మరింత రసవత్తరంగా మారడం ఖాయం అని గ్రామ రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

## బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 24 :**

మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి అన్నారు.. సోమవారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్. పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు బిజెపి పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందన్నారు.. ఇటీవల బీహార్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఎన్డీఏ కూటమికి ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని పేర్కొన్నారు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బిజెపి పార్టీ అభ్యర్థులు గెలుపొందేలా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలి అన్నారు.. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్.. పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్.. మండల ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ.. బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు చందుపట్ల అనిల్.. రహీం ధ్రువ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ కుస్తీ పోటీలలో సత్తా చాటిన ఖేడ్ మైనారిటీ బాలుర గురుకుల విద్యార్థులు



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 24 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణం లోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ కుస్తీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. వీరు గత రెండు రోజులుగా హైదరాబాద్ లోని జిహెచ్ఎంసి రెడ్ హిల్స్ మైదానంలో జరిగినటువంటి కుస్తీ పోటీలలో మంచి ప్రతిభ కనపరచి మూడు బహుమతులు కైవసం చేసుకున్నారు. అందులో ఒకరు చాంద్ సబ్ సిల్వర్ మెడల్, ఇర్ఫాన్, రహమాన్ బ్రోన్జ్ మెడల్స్ సాధించడం జరిగింది. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాములు పాఠశాల కో-ఆర్డినేటర్ జాకీర్, సంజీవ నాయక్ వ్యాయామ ఉపాధ్యాయులు అజీజ్, సంతోష్ మరియు పాఠశాల సిబ్బంది వీరిని శాలువతో సత్కరించి అభినందించారు.

# ఈ పాపం ఎవరిది?

- ప్రభుత్వ హాస్పిటల్ లో ఏం జరుగుతుంది
- సానిటైజేషన్ ఉద్యోగస్తులకు ఉద్యోగ భద్రత ఎక్కడ!
- వంద పడకలు కాదు కదా అతి త్వరలో 30 పడగలకు వస్తుందా!
- గత ఆరు నెలల నుంచి హాస్పిటల్లో డెలివరీ శాతం ఎంత






**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 24:**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ 1952లో ఏర్పడినది. నాటి నుంచి ఎంతో గొప్ప చరిత్ర కలిగిన హాస్పిటల్ 1972లో నేడు ఉన్న ప్రదేశంలో ఏర్పాటు అయినది. ఈ హాస్పిటల్ చేసిన మంచి కార్యక్రమాలు చాలా గొప్పవి ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంలో ఒక వెలుగు వెలిగిన ఈ హాస్పిటల్ గత నాలుగు సంవత్సరాల నుంచి కనుమరుగు అవడానికి దగ్గరగా వస్తున్నది. గతంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ హాస్పిటలను ఏరియా హాస్పిటల్ గా కానీ ప్రస్తుతం రికార్డుల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా కొనసాగుతున్నది.

గత ప్రభుత్వం రామన్నపేట హాస్పిటల్ వంద పడకల హాస్పిటల్ గా మార్చాలని నిర్ణయించగా ఈ ప్రాంతంలో పనిచేసే ప్రజా ప్రతినిధులు దానిని కాస్త నకిరేకల్ కు తీసుకువెళ్లినారు. ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేసినారు పోనీ ఈ హాస్పిటల్ ను పర్యవేక్షణ చేస్తూ రా అంటే గత 20 సంవత్సరాల నుంచి హాస్పిటల్ ను పర్యావేక్షణ చేసినది. చాలా తక్కువ పర్యాయాలు మాత్రమే యాదాద్రి జిల్లాలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ ను కాలేజీ గా మార్చగా రామన్నపేట ప్రభుత్వ హాస్పిటల్ ను జిల్లా హాస్పిటల్ గా మార్చాలని 100 పడకల హాస్పిటల్ గా మార్చాలని ఎన్నో వినుతులు వచ్చాయి. ఈ ప్రాంత బిడ్డలు పోరాటం చేశారు రామన్నపేట పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. నెత్తి ఒకతాడ ఉంటే కత్తెర మరోచోట ఉన్నది. ప్రస్తుతం రామన్నపేట హాస్పిటల్లో కేవలం ఒపి మాత్రమే నడుస్తూ ఉన్నది.ప్రస్తుతం 52 పడకలుగా కొనసాగుతూ ఉంటే ప్రస్తుతం ఉన్న సూపరిండెంట్ చిన్నా నాయక్ జిల్లా అధికారిగా అతనే ఉండడం స్థానిక అధికారిగా అతనే ఉండడం ఎక్కడ న్యాయం చేయలేకపోతున్నాడు. గత నెల కేవలం నాలుగు నుంచి ఐదు డెలివరీలు అయితే మరి ఈ హాస్పిటల్ భవిష్యత్ ఎక్కడ పోతుంది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ లో పదికిపైన డెలివరీ అయినాయి. జిల్లా అధికారిగా స్థానిక అధికారిగా ఆయన ఎక్కడ న్యాయం చేయలేక పోవడం వలన

నేడు అడ్మిషన్స్ రాక డెలివరీస్ కాక సానిటైజేషన్ సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. అనే సాకుతో నాలుగు నుంచి 8 మందిని తొలగించాలని ఆదేశాలు జారీ చేయడం దేనికి సంకేతం ఇస్తుంది. 50 పడకల హాస్పిటల్ 48 పడకలుగా రానున్న రోజుల్లో ఎక్కువగా స్టాఫ్ నర్స్ ఉన్నారు. అని అడ్మిషన్స్ కాకపోతే వీరిని కూడా ఇతర ప్రాంతాల వరకు ట్రాన్స్ఫర్ చేయవలసి వస్తుంది. రానున్న రోజుల్లో 50 పడకల హాస్పిటల్ కాస్త 30 పడగలుగా మారే అవకాశం ఉంది నేటికైనా ప్రజాప్రతినిధులు రామన్నపేట మండలా లీడర్లు అధికారులు గుర్తించి రామన్నపేట ప్రభుత్వాసుపత్రిలను 100 పడకల హాస్పిటల్ గా మార్చాలని హాస్పిటల్ ఈ స్థితికి రావడానికి కారణమైన అధికారులను డాక్టర్లను గుర్తించి ఇతర ప్రాంతాలకు ట్రాన్స్ఫర్ చేయాలని రామన్నపేట మండల ప్రజలు కోరుతున్నారు. ఈ పాప ముమ్మాటికి రామన్నపేట మండల లీడర్ల ది!


# నాకు అయ్యప్ప స్వామి అంటే అత్యంత ఇష్టం

- అయ్యప్ప దీక్ష మనిషిలో గొప్ప పరివర్తన తీసుకు వస్తుంది
- ఈర్ష్యా, ద్వేషాలు, దురలవాట్లు తగ్గి సమాజం పట్ల కరుణ గుణం కలుగుతుంది
- భగవంతుడు చెప్పేది సాటి మనిషిని ప్రేమించమనే
- 41రోజుల మండల కఠిన దీక్షలో సాక్షాత్తు అయ్యప్పను మీలో చూస్తాం
- అయ్యప్ప ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్న
- ఇంత మంచి ఆధ్యాత్మిక వాతావరణంలో పడి పూజ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి అభినందనలు
- అయ్యప్ప పడి పూజ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి









**యాదగిరిగుట్ట వెలుతురు నవంబర్ 24:**

ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నివాసంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయ్యప్ప నామస్మరణతో పడి పూజ కార్యక్రమం ఆద్యంతం ప్రతి ఒక్కరిని భక్తి పారవశ్యంలో మునిగేలా చేసింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తో,పలువురు నాయకులతో కల్సి దర్శించుకున్నారు. మంత్రికి వేద పండితులు ఆశీర్వాదం,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... "నాకు అయ్యప్ప స్వామి అంటే అత్యంత ఇష్టం. ఇంత మంది అయ్యప్ప భక్తులను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉన్నది. మంచి ఆధ్యాత్మిక భావన కలుగుతుంది. అయ్యప్ప దీక్ష మనిషిలో గొప్ప పరివర్తన తీసుకు వస్తుంది. ఈర్ష్యా, ద్వేషాలు,దురలవాట్లు తగ్గి సమాజం పట్ల కరుణ గుణం కలుగుతుంది. భగవంతుడు కూడా చెప్పేది సాటి మనిషిని ప్రేమించమనే కదా. 41రోజుల మండల కఠిన దీక్షలో సాక్షాత్తు అయ్యప్పను మీలో చూస్తాం. చన్నీటి స్నానం,ఒక్క పూట భోజనం,కటిక నేల మీద నిద్ర అయ్యప్ప దీక్షలో కఠిన నియమాలు. వాటిని పాటిస్తూ మండల కాలంలో గొప్ప మార్పు దీక్ష పరుల్లో కల్గుతుంది. అయ్యప్ప స్వామి దయతో రైతులు పాడి, పంటలతో,ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్న. ఇంత మంచి ఆధ్యాత్మిక వాతావరణంలో పడి పూజ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారికి అభినందనలు." అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## చంద్రమౌళీశ్వరుడికి మహాభిషేకం





**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 24 :**

నారాయణఖేడ్ వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు ఉదయం 9 గంటలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం, మహాహారతి నిర్వహించగా మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన,హనుమాన్ చాలీసా,గీతా పారాయణం,లలితా సహస్ర నామావళి కార్యక్రమాలు 10 గంటల వరకు కొనసాగించారు. కాగా ప్రతి సోమవారం భక్త మార్కండే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో,భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమం 10:30 నిమిషాలకు చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని అకస్మిక తనిఖీలు చేసిన ఖేడ్ ఎమ్మెల్యే

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 24 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం సిరిగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పి హెచ్ సి ఆసుపత్రి నీ ఆకస్మిక తనిఖీలు చేసిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేసే వైద్యులకు సిబ్బందులు పని తిరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు సరైన వైద్యం అందిస్తే లేరని సరిగా విధులు నిర్వర్తించలేరని చాలామంది ప్రజలు నా దృష్టికి తీసుకురావడంతో నేను ఈరోజు ఈ ఆస్పత్రికి రావడం జరిగిందని ఇప్పటినుండి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించి విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆసుపత్రి వైద్యులకు మరియు సిబ్బందిలకు



ఎమ్మెల్యే వైద్య హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు మండల ఎమ్మార్వో కిరణ్ కుమార్, మండల ఎంపిడిఓ,మరియు యాదవ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు, స్వప్న శంకరయ్య స్వామి మాజీ సర్పంచ్, శ్రీనివాస్ రావు పాటిల్, పీరప్పమాజీ ఎంపీటీసీ, కిషోర్,జైరాజ్,పండరి,కృష్ణ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## జహీరాబాద్‌లో ప్రైవేట్ స్కూల్ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతతో 32 మంది విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 24:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సోమవారం సాయంత్రం ఓ ప్రైవేట్ పాఠశాల బస్సులో మంటలు చెలరేగిన ఘటన పెద్ద ప్రమాదం తప్పించింది. పట్టణంలోని రావూస్ పాఠశాల బస్సు విద్యార్థులను ఇళ్లకు దింపుతూ బీదర్ చౌరస్తా దాటుతున్న సమయంలో, బస్సు బ్యాటరీ, ఇంజిన్ కింది భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు, మంటలు రావడం మొదలైంది. ఈ క్రమంలో అప్రమత్తమైన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును రహదారి పక్కకు ఆపి, అందులో ఉన్న 32 మంది చిన్నారులను క్రమంగా బయటకు దింపి సురక్షిత ప్రాంతానికి పంపించాడు. తరువాత పక్కనే వెళ్తున్న వాహనంలో ఉన్న ఫైర్ ఎక్స్టింగ్విషర్ సహాయం తీసుకుని, బ్యాటరీ - ఇంజిన్ భాగాలపై స్ప్రే చేసి మంటలను అదుపు చేశాడు. సమీపంలోని హోటళ్లలో పనిచేస్తున్న వారు బకెట్లు, బిందెలలో నీళ్లు తీసుకుని వచ్చి మంటలను పూర్తిగా ఆర్పేందుకు సహకరించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



## మండల రెవెన్యూ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 24 :**





సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల కేంద్రంలో ఈరోజు సిర్గాపూర్ మండలం ఏర్పడ్డనాటి నుండి ఇప్పటి వరకు అద్దె భవనం లో ఎమ్మార్వో కార్యాలయం సేవలందించడం జరిగింది గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో కనీసం ఆ భవనం అద్దె ను కూడా కట్టలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఖేడ్ శాసనసభ్యులుగా పాత బకాయిలను కూడా చెల్లించడం తో పాటు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి నీ మరమత్తులు చేయించి దాన్ని ఉపయోగం లోకి తీసుకోవడం తో మండల రెవెన్యూ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం మండల కేంద్రంలోనీ ఉర్దూ పాఠశాల వెళ్ళే దారి కొరకు నూతన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు మండల ఎమ్మార్వో కిరణ్ కుమారు డిప్యూటీ ఎమ్మార్వో హేమంత్, ఆర్ ఐ మదన్, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్



**అమీన్‌పూర్ వెలుతురు నవంబర్ 24:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం విశేషంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు మరియు అమీన్పూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ శశిధర్ రెడ్డి,సుధాకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## అమీన్పూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సం కార్యక్రమంలో పాల్గొన్న నందారం నరసింహా గౌడ్



**అమీన్పూర్ వెలుతురు నవంబర్ 24:**



సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అమీన్పూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి గార్లతో కలిసి ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. హాజరైన అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు.

## శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి





**గుమ్మడిదల వెలుతురు నవంబర్ 24:**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. అనంతరం ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న రాజగోపురం స్లాబ్ పనులను ప్రారంభించారు. హాజరైన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, షేక్ హుస్సేన్, ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు.

# వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి

**- జహీరాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సామూహిక వందే మాతరం ఆలాపన...**

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 24:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక వందేమాతరం గీత ఆలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేశభక్తి సందేశంతో సాగిన ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజీ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశపాండే పాల్గొన్నారు. వందేమాతరం గేయం 150 ఏళ్ల చరిత్రలోని విశిష్టతను, దాని ప్రాధాన్యతను విద్యార్థులకు వివరిస్తూ ఎమ్మెల్సీ అంజీ రెడ్డి ప్రసంగించారు. వందేమాతరం భారత జాతి స్వాతంత్ర్య ఉద్యమానికి నాంది పలికిన



గేయమని, ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. సామూహికంగా వందేమాతరం గానం చేయడం ద్వారా యువతలో దేశభక్తిని పెంపొందించడం ముఖ్యమని అన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నౌబత్ జగన్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనర్సింహ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, సుధీర్ భండారి, సుభాష్ రెడ్డి, నరేన్ దేశపాండే, రామన్న, జిల్లా నాయకులు మఠం విశ్వనాథ్, శ్రీనివాస్ గుప్తా, అరుణ కౌలాస్, మండల అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్, వైజ్యనాథ్, బంటు విశ్వనాథ్, మహిళా నాయకులు ఉమారాణి, అర్చన, శారద, గంజి మంజులత, సుచిత్ర, బొగ్గుల సంతోష్, సురేష్ పూరీ, అప్పం శ్రవణ్, అరుణ్ కుమార్, శివపూజ, శ్రీకాంత్, అప్పం రమేష్, జీవన్ జైన్, ఉప్పల శ్రీకాంత్, సందీప్, చందు, హరీష్ తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, వందేమాతరం గేయం 150 ఏళ్ల సందర్భంగా నిర్వహించిన ఈ వేడుక జహీరాబాద్ ప్రజలను ఆకట్టుకుంది.


## జహీరాబాద్ బీదర్ చౌరస్తాలో రావుస్ స్కూల్ బస్సులో మంటలు ... భద్రత పై పలు ప్రశ్నలు

**- హెచ్చరించినా పట్టించుకోని అధికారులు, స్కూల్ యాజమాన్యం...**

**- నిబంధనల ఉల్లంఘనతో స్కూల్ బస్సులు.. అధికారులు ఎందుకు మౌనం?**




**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 24:**
జహీరాబాద్ పట్టణంలో స్కూల్ బస్సుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం తలెత్తించిన ప్రమాదం ఇంకోసారి ఆందోళన కలిగించింది. గత రెండు రోజులుగా జహీరాబాద్‌లో నడుస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సులు నిబంధనలు పాటించడం లేదని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు నేత పత్రికాముఖంగా ప్రభుత్వ అధికారులకు పలు మార్లు తెలియజేసినా, సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోని పరిస్థితి స్పష్టంగా బయటపడింది. సోమవారం సాయంత్రం జహీరాబాద్ బీదర్ చౌరస్తాలో రావుస్ స్కూల్ బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగి చిన్నారుల ప్రాణాలను ముప్పుకు గురి చేసిన ఘటన చోటుచేసుకుంది. బస్సు అడుగు భాగంలో మంటలు ఎగసి, దట్టమైన పొగలు రావడంతో బస్సులో ఉన్న చిన్నపిల్లలు భయంతో అరుస్తూ వెంటనే దిగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైవర్ అప్రమత్తతతో బ్యాటరీ కనెక్షన్ తొలగించడంతో భారీ ప్రమాదం తృటిలో తప్పింది. అయితే బస్సులో పూర్తి స్థాయి కేబుల్ వైరింగ్ దగ్ధమై రోడ్డుమీద పెద్దఎత్తున మంటలు చెలరేగిన దృశ్యాలు భయానకంగా మారాయి. ఇంత పెద్ద ప్రమాదం జరిగినప్పటికీ బస్సులో ఫైర్ ఎక్స్‌టింగిషర్ వంటి కనీస భద్రతా పరికరాలు లేకపోవడం అత్యంత విచారకరం. పరిశీలించాల్సిన అధికారులు మాత్రం మామూలు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ, సరైన తనిఖీలేకుండానే స్కూల్ బస్సులకు లైసెన్సులు జారీ చేస్తున్నారని జాగో తెలంగాణ నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ స్కూల్ యజమానులు స్కూల్ బస్సులను పెండ్లిళ్లు, ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాలకు అద్దెకు



ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని పి. రాములు నేత ముఖ్యంగా గుర్తుచేశారు. ఈ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఒక్క రూపాయి పరిహారం కూడా రాదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు మేల్కొని జహీరాబాద్ పట్టణంలో నడుస్తున్న అన్ని స్కూల్ బస్సులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాగో తెలంగాణ డిమాండ్ చేసింది. అలాగే డ్రైవర్ల అర్హతలు, వారి పని పరిస్థితులను కూడా పరిశీలించాలని కోరింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టాలు జరిగితే దానికి పూర్తి బాధ్యత మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌దే అవుతుందని జాగో తెలంగాణ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న బస్సు ప్రమాదాలు, ప్రాణ నష్టాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన సమయం ఇది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాగో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజ్జా భాస్కర్, కార్యవర్గ సభ్యులు శాంత్ కుమార్, మహమ్మద్ ఇమ్రాన్, అరవింద్, ప్యార్ల దశరథ్, మాదినం శివప్రసాద్, నగారి రవి, బాలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ కట్టుబాటు

**- చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్...**

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 24:**
మహిళా సాధికారతను సుస్థిరంగా ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఝరసంగం మండల కాంగ్రెస్ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో బలపడేందుకు ప్రత్యేక ప్రణాళికలను కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళలు స్వయం ఆధారితంగా ఎదగడానికి అవసరమైన ప్రతి విధమైన సహకారాన్ని ప్రభుత్వం అందించనున్నదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం, అన్ని సంక్షేమ పథకాలను త్వరితగతిన అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి



పెడుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ, తమ అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న అండదండలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అష్రఫ్ అలీ, రాజేందర్ సింగ్, బక్కప్ప, మల్లయ్య స్వామి, అన్సర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే ఆపేయాలి

**- అవ్వారు వేణు కుమార్ బీసీ ఇంటలెక్చు వల్స్ ఫోరం -స్టేట్ కోఆర్డినేటర్**

**- బైరు శేఖర్ బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్**

**సంగారెడ్డి వెలుతురు నవంబర్ 24:**
బీసీలను రాజకీయంగా అణచివేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం మరొక్కసారి 46 జీవోను తీసుకువచ్చిందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం స్టేట్ కోఆర్డినేటర్ వేణు కుమార్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి అగ్రవర్ణాల వారికి ప్రాముఖ్యత ఇచ్చి, బీసీల నోటికాడ ముద్దను గుంజుకుంటున్నారు అన్నారు. తక్షణమే గ్రామపంచాయతీ ఎన్నికలు ఆపాలి. తమిళనాడు తరహాలో ఆనాటి ముఖ్యమంత్రి జయలలిత అన్ని పార్టీల నాయకులను, ఉద్యమకారులను ఢిల్లీకి తీసుకుపోయి ప్రధానమంత్రి, రాష్ట్రపతిని కలిసి తొమ్మిదో షెడ్యూల్లో పెట్టిచి చట్టం చేయించారు. అక్కడ బీసీలు 33 సంవత్సరాలుగా రిజర్వేషన్లను తీసుకొని అన్ని రంగాలలో ముందుకు పోయారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బిజెపితో చేసుకున్న చీకటి ఒప్పంద రాజకీయాలు ఆపేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీని కోర్టుల తీర్పులు సాకు చూపకుండా రాజ్యాంగబద్ధంగా నెరవేర్చాలని అన్నారు.. పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్, మాట్లాడుతూ ప్రతి గ్రామం లో బీసీలు 70శాతం ఉంటారు కానీ ఇప్పుడు ఉన్నా



రిజర్వేషన్ ప్రకారం 22% శాతం కూడా సర్పంచ్ లు, జడ్పిటిసిలు ఎంపీటీసీలు వార్డ్ మెంబర్లు కూడా 22%శాతం వచ్చే ప్రమాదం ఉన్నది.. తెలంగాణా రాష్ట్ర రాక ముందు 34శాతం ఉన్నా బీసీ రిజర్వేషన్ లు తెలంగాణ వచ్చిన తరువాత 22%శాతం పడిపోవాడిని ప్రశ్నిస్తూ ఉమ్మడి సంగారెడ్డి జిల్లా లో ఉన్నా బీసీలు ఏకమై ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ స్థానాలు పోను అన్ని జనరల్ స్థానాలలో బీసీ లు పోటీ చేయాలనీ పిలుపునిచ్చారు మూడు పార్టీ లను తెలంగాణా రాష్ట్ర లో భూస్థాపితం చేస్తాం అనీ హెచ్చరించాడు ఈ కార్యక్రమంలో సిలువేరు నాగరాజు, మిరుదొడ్డి నగేష్ గంగపుత్ర, గణేష్ ముదిరాజ్, జి రవీంద్ర జక్కల రమేష్ యాదవ్ తుమ్మల నరసింహారావు, వీరమల్ల రమేష్, కార్యక్రమంలో పాల్గొన్నారు



## మత్తు పానీయాలను అరికట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలి.

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి.**

**- హయత్ నగర్ లో పెద్ద అంబర్ పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.**

**హయత్ నగర్ వెలుతురు నవంబర్ 24:**
హయత్ నగర్ కుంట్లూర్ రోడ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దఅంబర్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను సోమవారం రోజున ఉదయం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ దశరథ సూపరెండెంట్ ఉజ్వలారెడ్డి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుక మధుసూదన్ రెడ్డి వైస్ ఛైర్మన్ భాస్కర చారి తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## మరో 15మంది మావోల లొంగుబాటు

**రాయ్‌పూర్,నవంబరు 24( వెలుతురు):**
మావోయిస్ట్ ల లొంగుబాటు కొనసాగుతోంది తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 15 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్‌లో చురుగ్గా పని చేస్తున్న నలుగురు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పిలుపునిచ్చారు..

# కుక్క కాటుకు కూడా మందు లేకపోతే ఎట్లా?

- సర్కార్ ఆసుపత్రులకు వచ్చే వాళ్లంతా పేద, మధ్య తరగతి ప్రజలే
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకోలేని వాళ్లే
- సూది మందుతోపాటు కనీస సౌకర్యాల్లేక పోతే పేదల పరిస్థితి ఏంది?
- అందుకే ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను అందిస్తున్నా
- ఇకపై ఇక్కడికి వచ్చే రోగులెవరూ ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే దుస్థితి రానీయొద్దు
- దాదాపు రూ.కోటి విలువైన మెడికల్ ఎక్విప్ మెంట్ ను ఆసుపత్రికి అందించిన కేంద్ర మంత్రి








**హుస్నాబాద్ వెలుతురు నవంబర్ 24:**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు కూడా మందు అందుబాటులో లేని దుస్థితి నెలకొందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. "సర్కార్ ఆసుపత్రులకు వచ్చే వాళ్లంతా పేద, మధ్య తరగతి ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకోలేని వాళ్లే. సూది మందుతోపాటు కనీస సౌకర్యాల్లేక పోతే పేదల పరిస్థితి ఏంది? చావాల్సిందేనా?" అని ప్రశ్నించారు. ఇకపై ఇక్కడికి వచ్చే రోగులెవరూ ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే దుస్థితి రానీయొద్దని, అందుకోసం తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను, సాయాన్ని అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. "ఇకపై ఒక్క పేషెంట్ కూడా ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే పరిస్థితి రానీయొద్దు. ఈ ఆసుపత్రికి ఇంకా ఏమేం కావాలో చెప్పండి. అన్ని సౌకర్యాలను సమకూరుస్తా. ఈ ఆసుపత్రికి వచ్చే వాళ్లంతా పేదలు, మధ్య తరగతి వాళ్లే. ఆర్థికంగా లేనివాళ్లే. అట్లాంటి వాళ్లను టెస్టుల్లేవనో, సూది మందు లేదనో ప్రైవేట్ ఆసుపత్రికి పంపి వారిపై భారం మోపొద్దు. పేదలకు సేవ చేయడం మహా భాగ్యం. మానవ సేవే మాధవ సేవ అని గుర్తుంచుకుని సేవలందించండి."అని కోరారు. సోమవారం రోజున కేంద్ర మంత్రి బండి సంజయ్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఎన్ ఎండీసీ సంస్థ సహకారంతో సీఎస్సార్ నిధులతో దాదాపు రూ.కోటి విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు. ఇందులో ఈసీజీ మిషన్లు, అల్ట్రాసౌండ్ మిషన్, ఈఎన్టీ సర్జికల్ మైక్రోస్కోప్, మల్టిపుల్ మానిటర్స్ మార్చురీ కేబినెట్ సహా మొత్తం 15 రకాల వైద్య పరికరాలను (మెడికల్ ఎక్విప్ మెంట్స్) ఉన్నాయి. ఆ సేవలను ఈరోజు బండి సంజయ్ ప్రారంభించారు. ఆయా పరికరాల ద్వారా అందించే సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం రోగులను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లతో సమావేశమై ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే....

విద్య, వైద్య రంగాలకు సంబంధించి పేదలకు పూర్తిస్తాయిలో సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ దురదృష్టవశాత్తు...ఇయాళ ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఇక్కడికి వచ్చే రోగులకు సూదుల్లేవు, మందుల్లేవు, టెస్టులు చేయడానికి పరికరాల్లేవు. ఇయాళే వార్తలు చూసిన. కుక్క కాటుకు మందు కూడా లేదని వార్తలొస్తున్నాయి. అట్లయితే పేదల పరిస్థితి ఏంది? చనిపోవాల్సిందేనా?"అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వాళ్లంతా పేదలు, మధ్య తరగతి ప్రజలే. లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేరనే సంగతిని గుర్తుంచుకోవాలి. వాళ్లకు సరైన వైద్యం అందించాల్సిన బాధ్యత ఇక్కడి డాక్టర్లు, సిబ్బందిపై ఉంది. కేంద్ర నిధులతోనే దాదాపు సర్కార్ ఆసుపత్రులన్నీ నడుస్తున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పెద్ద ఎత్తున వస్తున్న నిధులు వస్తున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు ఇవ్వకపోవడంవల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులకు, సూది, కాటన్, ఇతర చిన్న చిన్న మెడికల్ పరికరాల కొనుగోలు చేయలేక ఇబ్బందులు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకునే నా పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏ ఇబ్బందుల్లేకుండా NMDC సంస్థ సహకారంతో సీఎస్సార్ ఫండ్స్ తో ఈ మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను కొనుగోలు చేసి ప్రభుత్వ ఆసుపత్రులకు అందించడం జరిగింది. గతంలో దాదాపు 3 కోట్ల రూపాయలకుపైగా నిధులను ఖర్చు చేసి ఎక్స్ రే మిషన్, సీటీ స్కాన్, అంబులెన్సులను కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి అందజేసిన. ఈరోజు వేములవాడతోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట సహా ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపు 4 కోట్ల రూపాయలకుపైగా సీఎస్సార్ నిధులను తీసుకొచ్చి మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందిస్తున్నా. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఇకపై ఏ ఒక్క రోగి కూడా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే... చికిత్స తీసుకోకుండా వెళ్లడానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలి. మానవ సేవే మాధవ సేవ. ప్రజలు డాక్టర్లను మాత్రమే ప్రత్యక్ష దైవంగా భావిస్తాం. అంతటి గొప్ప వృత్తిని దైవంగా భావించి పేదలకు సేవలందించాలని కోరుతున్నా.









## రైతును విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

- రెండేళ్లలో 720 మంది రైతుల ఆత్మహత్య
- కవిత తనపై ఎందుకు విమర్శలు చేస్తోందో
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆగ్రహం



**వనపర్తి,నవంబరు 24( వెలుతురు):**
రైతుల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మరికొద్ది రోజుల్లో ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటై రెండు ఏళ్లు పూర్తి చేసుకోబోతోందని.. ఈ కాలంలో 720 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సోమవారం వనపర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 10 శాతం పనులు పూర్తి చేస్తే అయిపోతుందని.. కానీ పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపకుండా తనపై దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమన్నారు. తాను ఒక్కసారి కూడా కవితపై పల్లెత్తు మాట అనలేదని తెలిపారు. డూప్లికేట్ కాంగ్రెస్ వాళ్లు తనపై సోషల్ మీడియాలో కావాలనే బ్లేమ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత ఎవరిని సంతోషపెట్టాలని తనపై ఎందుకు దూర్భాషాలాడుతుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కక్ష పూరితంగా ఎవరి మీద కేసులు పెట్టించ లేదన్నారు. ఒక వేళ అలా ఏమైనా ఉంటే నిరూపించాలని అంతేకాని అసత్య ఆరోపణలు చేయవద్దని కవితకు సూచించారు. తాను ఎంతో మంది విద్యార్థులను స్వంత ఖర్చులతో చదివించానని గుర్తు చేశారు. కానీ వాటిని తాను ప్రచారం చేసుకోలేదన్నారు. తాను గతంలో న్యాయవాదిగా ఉన్నప్పుడు పెబ్బేరు సంత భూమి విషయంలో 2003, 2007లో పూజారులకే చెందుతుందని తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. కానీ తాను కబ్జా చేశాననడం అసత్య ప్రచారమన్నారు. పూర్తి విషయ పరిజ్ఞానం లేకుండా తాను దేవుడి మాన్యాన్ని కబ్జా చేశానంటూ కవిత ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. తమ పార్టీ ఇప్పుడు అధికారంలో లేదని.. తనపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయాలంటూ ప్రత్యర్థులకు ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు సైతం కేసీఆర్‌ను కానీ.. ఆయన పార్టీ జెండాను కానీ వదల లేదన్నారు. తండ్రి వయస్సు ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటికి పిలిపించుకుని మాట్లాడుతున్నావంటూ కవితపై నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. తమలాంటి నలుగురు, ఐదుగురిపై విషం చిమ్ముతున్నావని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతోంది

- సూది, మందులు, దూది కూడా ఉండటం లేదు
- కేంద్ర నిధులను సరిగా వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- అతి త్వరలో జమ్మికుంట రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- ప్రభుత్వ ఆసుపత్రికి ఇచ్చిన పరికరాలను వాడుకోకుంటే వాపస్ తీసుకుంటానని స్పష్టీకరణ



**కరీంనగర్ వెలుతురు నవంబర్ 24:**
ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన



వ్యక్తం చేశారు. చాలా ఆసుపత్రుల్లో సూది, మందులు, దూది కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో పెద్ద ఎత్తున నిధులను సరిగా వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈరోజు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. దాదాపు రూ.కోటి విలువైన వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు. ఆ సేవలను కలెక్టర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం రోగులను కలిసి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లతో సమావేశమై ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే....

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ కోసం వచ్చేది పేదలు, మధ్య తరగతి ప్రజలు మాత్రమే. వాళ్లకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకునే స్థోమత ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వ నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రులకు పెద్ద ఎత్తున నిధులిస్తోంది. ప్రజలకు వైద్య సేవల పట్ల భరోసా ఇచ్చేందుకు యత్నిస్తోంది. దురదృష్టమేమ దంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను సరిగా ఉపయోగించడం లేదు. ఆసుపత్రికి వెళితే సూదులు, మందులు, దూది కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం లేకుండా పోతోంది. ఈ పరిస్థితిపై గతంలో నేను రివ్యూ చేశాను. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వాళ్లు బయటకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో సేవలందించాలంటే ఏం చేయాలని అడిగాను. డాక్టర్లు ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనల మేరకు నా బర్త్ డే నాడు రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించాను. వేములవాడ, జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్ఎండీసీ సంస్థ సాయంతో ఆధునాతన వైద్య పరికరాలను కొనుగోలు చేసి అందించాం. అందులో భాగంగా జమ్మికుంట సామాజిక వైద్య శాలకు ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్, ఆటోక్లేవ్ ఆపరేషన్, దయాథెర్మి మిషన్, అనెస్తీషియా, ఎమర్జెన్సీ రికవరీ ట్రాలీ, సిరంజ్ పంప్ సహా మొత్తం 15 పరికరాలను అందించాను. ఇకపై జమ్మికుంట ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలోనే ఎంపీ లాడ్స్ నుండి ఎక్స్ రే మిషన్ ను కూడా అందజేస్తా. దయాచేసి ఆ పరికరాలను రోగుల కోసం వినియోగించుకోవాలి. పట్టించుకోకుంటే మాత్రం వాటిని వాపస్ తీసుకుని పోయి ఇతర చోట్ల అందిస్తా. పేదలు ప్రభుత్వ ఆసుపత్రులను నమ్ముకుని వస్తే...వారికి పైసా భారం లేకుండా చికిత్స చేసి పంపాలని కోరుతున్నా. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు నెంబర్ వన్ గా ఉండేలా చూడాలని కోరుతున్నా.

దురదృష్టం ఏమిటంటే.... కొన్ని చోట్ల అంబులెన్సులు ఇచ్చినా వాడుకోవడం లేదు... అట్లయితే వాపస్ తీసుకుని వేరేవాళ్లకు ఇస్తా. వేములవాడ, కరీంనగర్ ఆసుపత్రుల్లో ఇట్లనే చేస్తే వాటిని వాపస్ చేసి వేరే ఆసుపత్రులకు పంపిన. ఇట్లయితే పేదలకు వైద్య సేవలు అందేది ఎట్లా? ఇది సరికాదు. డాక్టర్లు తమ మైండ్ సెట్ ను మార్చుకోవాలి.

చెక్ డ్యాం కూలిపోవడంపై స్పందిస్తూ...

చెక్ డ్యామ్ లు ప్రజల కోసం, రైతుల కోసం కాదు. కమీషన్ల కోసం చెక్ డ్యామ్ లను కడుతున్నారు. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కూడా బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగడం లేదు. కమీషన్లు ఇస్తున్నారు. నాసిరకం పనులు చేస్తున్నారు. ఆ చెక్ డ్యామ్ లు కూలిపోతున్నారు. ప్రణాళిక లేకుండా క్వాలిటీతో పనిలేకుండా చెక్ డ్యామ్ లు నిర్మించారని గత 6 నెలలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. పట్టించుకోవడం లేదు. గతంలో సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలోనూ చెక్ డ్యాంలు కూలిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చెక్ డ్యాంల కూలిపోవడంపై విచారణ జరపాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అట్లాగే కాంట్రాక్టర్ ఆస్తులను సీజ్ చేయాలి. అప్పుడే వాళ్లలో భయం ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కమీషన్లు తప్ప ఇంకోటి పట్టడం లేదు. బీఆర్ఎస్ కు తొత్తులుగా పనిచేసిన వాళ్లకు కూడా పైసలు తీసుకుని మంచి పోస్టింగ్ లు ఇస్తున్నారు. బీఆర్ ఎస్ కూడా ఇది గ్రహించి పైసలిచ్చి పంపిస్తున్నారు.

జమ్మికుంటకు స్పోర్ట్ స్టేడియం నిర్మాణం రైల్వే స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి ప్రతిపాదనలు రడీ చేస్తున్నారు. త్వరలోనే ఈ రెండు పనులను పూర్తి చేస్తాం.

# హెచ్ ఐ ఎల్ టి పాలసీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డికి లంకెబిందెలు దొరికాయి




**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 24:** హెచ్ ఐ ఎల్ టి పాలసీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డికి లంకెబిందెలు దొరికాయని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. హెచ్ ఐ ఎల్ టి పాలసీ విషయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం రోజున ఓ ప్రకటన విడుదల చేశారు...

### అందులో పేర్కొన్న విశేషాలు, ముఖ్యాంశాలు..

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ ఫర్మేషన్ (HILT) పాలసీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డికి లంకెబిందెలు దొరికాయి. ORR – ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 22 పారిశ్రామిక వాడలు (INDUSTRIAL ESTATES AND PARKS) కు చెందిన 9,292 ఎకరాల భూములను ఇక నుంచి మల్టి యూజ్ జోన్లుగా కన్వర్షన్ చేస్తూ (2025 నవంబరు 22) శనివారం ప్రభుత్వం జోవో–27 ను జారీ చేయడం ముమ్మాటికీ ల్యాండ్ లూటింగ్ పాలసీనే.

### HILT పాలసీ కుంభకోణం రూ.ఆరు లక్షల 29 వేల కోట్లకు పైనే

ఈ పారిశ్రామిక భూముల మార్కెట్ ధర ఒక గజం రూ.రెండులక్షల వరకు ఉంటుందని అంచనా. అంటే ఈ 9,292 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు 30 శాతం పోను మిగిలిన 6,510 ఎకరాలను గజాల చొప్పున విక్రయిస్తే రూ.ఆరు లక్షల 29 వేల కోట్లకు పైగా ప్రభుత్వానికి రాబడి వస్తుంది. అలాంటి విలువైన భూములను సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (S.R.O.) వాల్యూలో 30శాతానికే మల్టి యూజ్ జోన్లుగా మార్చుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా రేవంత్ సర్కార్ రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతోంది.

### ఈ HILT పాలసీతో వచ్చే రాబడితో రాష్ట్రానికి ఉన్న అప్పులు అన్నింటినీ తీర్చేయవచ్చు.

ఈ HILT పాలసీతో వచ్చే రూ.ఆరు లక్షల 29 వేల కోట్లతో రాష్ట్రానికి ఉన్న అప్పులు అన్నింటినీ తీర్చేయవచ్చు. ఏ ముఖ్యమంత్రి అయినా ఈ రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు ఈ HILT పాలసీని వాడుకోవాలి. ప్రభుత్వమే ఈ భూములను HMDA ద్వారా ప్లాట్లుగా చేసి విక్రయించినా రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల వరకు రాబడి వస్తుంది. నిర్మాణాలు చేపడితే అంతకు రెట్టింపు లాభం ఉంటుంది. కానీ లంకెబిందెల సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తాను లక్షల కోటీశ్వరుడు కావాలనే స్వార్థంతో, మంత్రులు తాము వేల కోటీశ్వరులు కావాలనే స్వార్థంతో ఈ HILT పాలసీని ఆదరాబాదరగా అమలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ HILT పాలసీని అమలు చేయడానికి వీల్లేదు. తక్షణమే అసెంబ్లీలో చర్చించిన తర్వాతే ఈ HILT పాలసీని అమలు చేయాలి. అప్పటి వరకు దీన్ని అమలు చేయకుండా పెండింగులో పెట్టాలి.

### HILT పాలసీపై అసలు క్యాబినెటులో లోతైన చర్చ జరిగిందా

అసలు ఈ HILT పాలసీపై ఈ నెల 17న జరిగిన క్యాబినెట్ మీటింగులో కూడా లోతైన చర్చ జరగలేదు. దీనిపై ప్రభుత్వం రూపొందించిన డ్రాఫ్టు పాలసీని మంత్రులకు సర్కులేట్ చేసి, వారు చదివాక మళ్లీ వెనక్కి తీసుకున్నారంటే సీఎం రేవంత్ రెడ్డి ఎంత పకడ్బందీగా ఈ రూ.ఐదు లక్షల కోట్ల కుంభకోణానికి తెరతీసారో స్పష్టమవుతోంది.

### HILT పాలసీ స్కాములో సీఎం రేవంత్ రెడ్డి వాటా రూ.మూడున్నర లక్షల కోట్లు, మంత్రులది రూ.లక్షన్నర కోట్లు, గాంధీ కుటుంబానికి రూ.లక్ష కోట్లు

క్యాబినెటులో ఈ HILT పాలసీపై మంత్రులెవరూ తమ అభ్యంతరం వ్యక్తం చేయలేదంటే ఈ ల్యాండ్ స్కాములో వారికి కూడా భాగస్వామ్యం ఉన్నట్టే. రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల స్కాములో సగం అంటే రూ.మూడున్నర లక్షల కోట్లు సీఎం రేవంత్ రెడ్డికి, 15 మంది మంత్రులకు రూ.10వేల కోట్ల చొప్పున వారికి రూ.లక్షన్నర కోట్లు. కాంగ్రెస్ హైకమాండ్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు చెరో రూ.50వేల కోట్ల చొప్పున రూ.లక్ష కోట్లు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రూ.30 వేల కోట్లు ముట్టనున్నాయి.

### సీఎం కుర్చీని కాపాడుకునేందుకే రేవంత్ రెడ్డి రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల స్కామ్ కు పాల్పడుతున్నారు

కాంగ్రెస్ సర్కారు రెండేండ్లు పూర్తి చేసుకున్నాక హైకమాండ్ రేవంత్ రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దించేసి మరో కీలక నేతను ముఖ్యమంత్రిని చేస్తుందని నేను గతంలో చెప్పాను. ఇపుడు రేవంత్ రెడ్డి తన సీఎం కుర్చీని కాపాడుకునేందుకు ఈ భారీ ల్యాండ్ స్కాముకు తెరతీసారు. తన సీఎం కుర్చీని కాపాడుకునేందుకు గాంధీ కుటుంబానికి రూ.లక్ష కోట్లు ముడుపులు ముట్టజెపు తున్నారు.

### రూ.లక్షల కోట్ల స్కామ్ సొమ్ముతో దేశ వ్యాప్తంగా కాంగ్రెసు పార్టీని కబ్జా పెట్టేందుకే హైదరాబాద్ భూముల దందా

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా సీఎం రేవంత్ రెడ్డి HILT పాలసీ స్కాముకు స్కెచ్ గీసారు. ఇటు రాష్ట్రంలో సీఎంగా మరో మూడేళ్ల పాటు తానే కొనసాగడంతో పాటు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చక్రం తిప్పాలనే ప్లానుతోనే ఈ HILT పాలసీ స్కామ్ కు తెరతీసరు. గతంలో కేసిఆర్ ఇక తనకు తెలంగాణలో తిరుగలేదని భావించి టిఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్ గా మార్చి దేశ వ్యాప్తంగా పోటీ చేయాలని చూసి భంగపడ్డారు. కేసిఆర్ తొమ్మిదేళ్ల పాటు సీఎంగా ఉన్న తర్వాత దేశ రాజకీయాలపై కన్నేస్తే, సీఎం రేవంత్ రెడ్డి రెండేండ్లకే ఆ పని చేస్తున్నారు. HILT పాలసీ స్కాము ద్వారా కొల్లగొట్టే రూ.మూడున్నర లక్షల కోట్లతో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో పెత్తనం చేయాలనేది రేవంత్ రెడ్డి స్కెచ్

### తెలంగాణ సర్కారు నడుపుతున్నది క్యాబినెట్ మంత్రులు కాదు స్కామ్ స్టర్స్

తెలంగాణ సర్కారు నడుపుతున్నది క్యాబినెట్ మంత్రులు కాదు స్కామ్ స్టర్స్. 15 మంది స్కామ్ స్టర్స్ కు డాన్ రేవంత్ రెడ్డి. ఇక్కడ ల్యాండ్ మాఫియా రాజ్యమేలుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త అయిన రేవంత్ రెడ్డి తన చీటింగ్, లూటింగ్ మైండుతో రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల స్కామ్ కు స్కెచ్ గీసారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతో ఆదరాబాదరాగా అమలు చేస్తున్నారు.

### HILT పాలసీపై క్యాబినెట్ మీటింగులో ఏ ఒక్కమంత్రి అయినా డీసెంట్ నోట్ ఇచ్చారా

ఈ HILT పాలసీపై క్యాబినెట్ మీటింగులో ఏ ఒక్కమంత్రి అయినా కన్సెంట్ ఇవ్వకుండా డీసెంట్ నోట్ ఇచ్చారా ... ఏ మంత్రి కూడా డీసెంట్ నోట్ ఇవ్వలేదంటే వారంతా ఈ ల్యాండ్ లూటింగ్ స్కాములో భాగస్వాములే. రూ.10వేల కోట్ల ముడుపుల కోసం మంత్రులు డిమాండ్ చేసినట్లు సమాచారం. అంటే ఇది క్యాబినెట్ కాదు దండుపాళ్యం ముఠా.

### రేవంత్ రెడ్డి కొన్ని నెలల కసరత్తు ... HILT పాలసీ రూపంలో లంకెబిందెలు

హైకమాండ్ పెద్దలకు రూ.50 కోట్లు ఇచ్చి పిసిసి చీఫ్ అయిన సీఎం రేవంత్ రెడ్డి ఆ తర్వాత కూడా ముఖ్యమంత్రి పదవి కోసం చాలా ఖర్చు చేసారు. ఆ సొమ్మంతా రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లు చేయడం ద్వారా సంపాదించిన అక్రమ సంపాదనే. సీఎం కాగానే ఇక్కడ లంకె బిందెలు ఉన్నాయనుకున్నా అంటూ తన మనసులో మాటను బయట పెట్టారు. అలా కొన్ని నెలలు కసరత్తు చేయగా రేవంత్ రెడ్డికి HILT పాలసీ రూపంలో లంకెబిందెలు దొరికాయి.

### S.R.O. వ్యాల్యూలో 30 శాతానికే ల్యాండ్ కన్వర్షనుకు అనుమతివ్వడం స్కాము కాక మరేంటి

50 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వాలు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తక్కువ ధరలకు ఈ భూములను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించింది. ఇందులో కొన్ని ఖాయిలా పడగా, మరికొన్ని లాభాల్లోనే కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని కాలుష్య కారక పరిశ్రమలు ఉన్నాయి. వీటిని ఔటర్ రింగ్ రోడ్డు ఆవలకు తరలించాలనేది ప్రభుత్వ ఆలోచన మంచిదే. మరి అలాంటపుడు ఉనికిలో ఉన్న పరిశ్రమలకు ల్యాండ్ టు ల్యాండ్ ఇచ్చి హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న భూమిని ప్రభుత్వమే స్వాధీనపరుచుకోవచ్చు కదా. అలా చేయకుండా S.R.O. వ్యాల్యూలో 30 శాతానికే ల్యాండ్ కన్వర్షనుకు అనుమతివ్వడం స్కాము కాక మరేంటి

### పారిశ్రామిక భూములను ప్రభుత్వమే తీసుకుని ప్రజాపయోగానికి వినియోగించవచ్చు కదా

పరిశ్రమలకు చెందిన 9,292 ఎకరాల భూములను కన్వర్షన్ చేసుకుంటే, ఈ భూముల్లో అపార్ట్మెంట్లు, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లు, కార్యాలయాలు, హెటళ్లు, స్కూళ్లు, కాలేజీలు, పార్కులు, క్యాంపస్‌లకు వినియోగించవచ్చు కదా. ఇంతటి ల్యాండ్ బ్యాంకును ప్రభుత్వం అడ్డికి పావుశేరు మాదిరిగా అగ్గువకు కన్వర్షన్ చేయడం వెనకున్నది ల్యాండ్ స్కాము కాదా. సీఎం రేవంత్ రెడ్డి సోదరుల టీమ్ ... కొన్ని నెలలుగా ఈ పారిశ్రామిక వేత్తలతో మంతనాలు జరుపుతూ ఆ భూములను కాజేసేందుకు వేసిన స్కెచ్చే ఈ HILT పాలసీ.

### రియల్టరుగా రేవంత్ రెడ్డి కొల్లగొట్టనున్న సొమ్ము రూ.6.29 లక్షల కోట్లు.

మార్కెట్ ధరలతో సమానంగా భూముల రిజిస్ట్రేషన్ ధరలను సవరించాకనే HILT పాలసీ అమలు చేయాలి.

HILT పాలసీలో ల్యాండ్ కన్వర్షనుకు మార్కెట్ ధరలకు అనుగుణంగా టీజీఐఐసీ ధరలను సవరించి అమలు చేయాలి. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరల్లో30 శాతానికే ల్యాండ్ కనర్వర్షన్ అంటే అడ్డికి పావుశేరు అమ్మడమే. పారిశ్రామిక భూముల కన్వర్షనుకు టీజీఐఐసీ ధరలను కాదని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరలను పరిగణలోకి తీసుకోవడంలోనే స్కాము దాగుంది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరలతో పోల్చితే టీజీఐఐసీ ధరలు మూడింతలుగా ఉన్నాయి. ఉదాహరణకు ఉప్పల్ పారిశ్రామికవాడలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు విలువ రూ.14, 591 కాగా, టీజీఐఐసీ విలువ రూ.54,340.టీజీఐఐసీ ధరల్లో మూడో వంతున్నసబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరల్లో 30 శాతానికే ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ను కట్టబెట్టడం స్కామ్ కాక మరేమిటీ

### రేవంత్ రెడ్డి తన సోదరులు, అనుచరుల ద్వారా ముందుగానే 22 పారిశ్రామిక వాడల్లోని భూముల ఓనర్లతో అగ్రిమెంట్లు కుదుర్చకుని, ఇపుడు తీరిగ్గా భూములను కొల్ల గొట్టేందుకే HILT పాలసీ

హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ ధరలను సవరిస్తామన్న ప్రభుత్వం ఎందుకని సవరించడం లేదు. ముందుగా ధరలను సవరించి ఆ తర్వాత HILT పాలసీ తెచ్చి ఉంటే ప్రభుత్వానికి మేలుజరిగేది కదా. అంటే తక్కువ రేట్లకు పారిశ్రామిక భూములను కట్టబెట్టి, వాటి ద్వారా రూ.లక్షల కోట్లు కొల్లగొట్టి జేబులు నింపుకోవాలనే రేవంత్ రెడ్డి దోపిడీ అజెండాలో భాగంగానే ఉన్నపళంగా HILT పాలసీ తెచ్చారు. రేవంత్ రెడ్డి తన సోదరులు, అనుచరుల ద్వారా ముందుగానే 22 పారిశ్రామిక వాడల్లోని భూముల ఓనర్లతో అగ్రిమెంట్లు కుదుర్చకుని, ఇపుడు తీరిగ్గా భూములను కొల్లగొట్టే HILT పాలసీని తెచ్చింది. ఇది పూర్తిగా హైదరాబాదులోని ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ను కొల్లగొట్టే భారీ స్కామ్.

### HILT పాలసీ ముమ్మాటికీ ఇన్ సైడర్ ట్రేడింగ్

ఇది ఒక రకంగా ఇన్ సైడర్ ట్రేడింగ్ స్కామ్. HILT పాలసీ తేవడానికి ఆరు నెలలు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి మనుషులు ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ఉన్న కంపెనీలతో అగ్రిమెంట్లు కుదుర్చుకుని అందులో వాటాదారులుగా చేరారు. ఈ అగ్రిమెంట్లు, కొత్త వాటాదారుల చేరికపై లోతైన దర్యాప్తు చేస్తే దోపిడీ దొంగలు దొరుకుతారు. రేవంత్ ప్రభుత్వం ఈ HILT పాలసీని అమలు చేయకుండా అబెయన్సులో పెట్టకపోతే, రేపు రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక దీనిపై లోతైన దర్యాప్తు జరిపి అందరినీ జైల్లో పెడతాం.

### రాష్ట్రంలో గొర్రెలను తినేటోడు పోయి బర్రెలను తినేటోడు వచ్చిండన్నమాట

ఇపుడు రేవంత్ సర్కార్ చేస్తున్న ల్యాండ్ స్కామునే గతంలో బీఆర్ఎస్ సర్కార్ కూడా చేసిందని మంత్రి శ్రీధర్ బాబు అంగీకరించారు. అజామాబాద్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేటలోని పారిశ్రామిక భూములకు ఫ్రీ హోల్డ్ పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వమే యాజమాన్య హక్కులు కల్పించిందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ మేరకు 2023 ఆగస్టు 20న జీవోను జారీచేశారని తెలిపారు. బీఆర్ఎస్ సర్కారు ఇలా ఫ్రీ హోల్డ్ పేరిట ఎకరాకు రూ.50 నుంచి రూ.60కోట్లకు ఉన్న విలువైన భూములను ఎకరాకు రూ.10 కోట్లకే కట్టబెట్టారని, ఇలా వందల కోట్ల ప్రభుత్వ భూములను అప్పటి మంత్రి కేటిఆర్ తన వారికి అప్పనంగా కట్టబెట్టి ప్రజాధనాన్నికొల్లగొట్టారని శ్రీధర్ బాబు ఆరోపించారు. అంటే అపుడు బీఆర్ఎస్ సర్కార్ భూ దోపిడీకి పాల్పడింది కాబట్టి ఇపుడు తాము చేస్తే తప్పేంటనే ధోరణిలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడడం సిగ్గుచేటు. అంటే రాష్ట్రంలో గొర్రెలను తినేటోడు పోయి బర్రెలను తినేటోడు వచ్చిందని ఆయన ఘాటుగా ప్రకటనలో వ్యాఖ్యానించారు.

## సర్పంచ్ ఎన్నికల్లో లబ్ది కోసమే ఇందిరమ్మ చీరలు

- ఇందిరమ్మ ఇళ్లు కేవలం తాయిలాల కోసమే
- బిజెపి ఎంపి డికె అరుణ విమర్శలు



**నారాయణపేట,నవంబర్24( వెలుతురు):** పార్టీ గుర్తులపై సర్పంచులు గెలవరు. అలాంటప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్స్ ఎలా ఇస్తారని ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ఏ రకంగానైనా సర్పంచ్ ఎన్నికల్లో లబ్ది పొందాలని ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలంటూ తాయిలాలు ప్రకటిస్తుందని విరుచుకు పడ్డారు. దసరాకు ఇవ్వాల్సిన చీరలు ఇప్పుడెందుకు ఇస్తున్నన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. దమ్మంటే పాలమూరు జిల్లాలో రోడ్లు బాగు చేయాలని సవాల్ విసిరారు. నారాయణపేటలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలకు దిక్కులేక కేంద్రం నిధుల కోసం కక్కుర్తి పడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే సర్పంచుల పదవీకాలం పూర్తికాగానే ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేతకానితనం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ. 3 వేల కోట్లు పంచాయతీల నిధులు ఆగిపోయాయని వెల్లడించారు. ఆ నిధుల కోసమే కాంగ్రెస్ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేస్తోందిని అన్నారు. ఎన్నికల కోసం కాంగ్రెస్ తీరు చూస్తే నవ్వొస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లు, 2024 సర్వే ప్రకారం వార్డ్ మెంబెర్స్ రిజర్వేషన్లు నిర్వహించడం విచారకరమని పేర్కొన్నారు. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని అన్నారు . పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ కావాలా..? కాంగ్రెసోళ్ళు ఇచ్చే ముతక చీరలు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కొడంగల్‌కు రోడ్లు వేసుకుంటే హైదరాబాద్ , సికింద్రాబాద్‌లా మారిపోయినట్లేనా ? నని నిలదీశారు. జిల్లా వాసికి ముఖ్యమంత్రి అవకాశం వచ్చినా ఇక్కడి ప్రజలకు ఒరిగింది ఏమిలేదని ఆరోపించారు. కేంద్రం ఇచ్చే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## బిసిలకు హామీతోనే కాంగ్రెస్ అధికారం

- బీహార్‌లోనూ 42శాతంపై రాహుల్ ప్రచారం
- మాట తప్పడం..మడమ తిప్పడం రేవంత్ నైజం
- మాజీ స్పీకర్ మధుసూధనాచారి విమర్శలు

**హైదరాబాద్,నవంబర్24( వెలుతురు):** మడమ తిప్పడం.. మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర అని మాజీ స్పీకర్ మధుసూదనచారి విమర్శించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని .. బిహార్‌లో రాహుల్ గాంధీ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బండ ప్రకాశ్, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి మధుసూదనచారి మీడియాతో మాట్లాడారు. బీసీలకు హామీలు ఇవ్వడంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మధుసూదనచారి తెలిపారు. హామీలు అమలు చేయనందుకు రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా బీసీల కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని అన్నారని గుర్తుచేశారు. కానీ హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి బీసీలు చరమగీతం పాడతారని హెచ్చరించారు.జీవో నంబర్ 46తో బీసీల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని బండ ప్రకాశ్ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై



ప్రభుత్వ చర్యలు ప్రహసనంగా మారిందని అన్నారు. ఆర్టికల్ 340 కింద డెడికేటెడ్ కమిషన్ వేయాలని కోరామని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన కమిషన్‌కు రాష్ట్రపతి ఆమోదం కూడా ఉంటుందని చెప్పామని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సూచన పట్టించుకోలేదని మండిపడ్డారు. రెండు ప్రధాన పార్టీలు సంపూర్ణంగా సహకరిస్తే తప్ప ఇది సాధ్యం కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. బీసీలకు అన్ని రాజకీయ అవకాశాలు ఇచ్చింది బీఆర్ఎస్ మాత్రమేనని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ అడుగడుగునా బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ అంటే రాజకీయాల్లో కేవలం 42 శాతం రిజర్వేషన్లే కాదని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాల బిల్లులు పాస్ చేసి ఇంకా జీవో ఇవ్వలేదని తెలిపారు. పార్టీ గుర్తులు లేని ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తమిళనాడు తరహా మినహా మరే మార్గం లేదని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.11 వేల కోట్ల బకాయిలు ఉందని తెలిపారు. కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలను కలుపుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడతామని తెలిపారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ప్లాన్ ప్రకారం బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు నిలదీస్తే వాకిటి శ్రీహరి, అజారుద్దీన్‌కు మంత్రి పదవులు ఇచ్చారని తెలిపారు. బీసీలకు నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ చట్టసవరణతో అవుతుందని తెలిసి కూడా కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. గెలిచినవాళ్లనంతా తమవాళ్లే అని చెప్పుకోవడానికే సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. బీసీలను కడుపులో పెట్టుకొని కేసీఆర్ చూసుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఏనాడు పార్లమెంటులో బీసీ బిల్లుపై మాట్లాడలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గుర్తుచేశారు. కాంగ్రెస్ తప్పు ఒప్పుకొని బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## వేధింపుల భర్తను కడతేర్చిన భార్యలు

- పెట్రోల్ పోసి నిప్పంటించిన ఇద్దరు పెళ్లాలు

**నిజామాబాద్,నవంబర్24( వెలుతురు):** మద్యం సేవించి తరచూ వేధిస్తున్న భర్తను ఇద్దరు భార్యలు కలసి మట్టుబెట్టారు. దారుణంగా హత్య చేశారు. ఆయన ఇద్దరు భార్యలు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం దేవక్కపేటలో చోటు చేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవక్కపేటకు చెందిన మలవత్ మోహన్ (42)కు ఇద్దరు భార్యలు కవిత, సంగీత ఉన్నారు. మోహన్ తరచూ మద్యం తాగుతూ.. భార్యలతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి వారిద్దర్నీ గదిలో బంధించాడు. దీంతో విసిగిపోయిన భార్యలిద్దరూ అతడిని వదిలించుకోవాలనుకున్నారు. పథకం ప్రకారం.. సోమవారం ఉదయం పెట్రోల్ కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మోహన్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో మంటలు అంటుకొని మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈఘటన గ్రామంలో సంచలనం రేపింది. సర్వత్రా ఇదే అంశంపై చర్చించారు. భార్యల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్లుగా రాజాసాబ్

## పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు

ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి 'ది రాజాసాబ్' ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది రాజాసాబ్'. తాజాగా ఈ సినిమా నుంచి 'రెబల్ సాబ్' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'రెబల్ సాబ్'ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది. ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు.రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. 'కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబల్ యూనివర్సిటీలో




చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు' అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ' ముందుగా నేను ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం లేదా అగౌరవపరచడం నా ఉద్దేశ్యం కాదు. కొన్నిసార్లు మాటల ప్రవాహంలో మనం అనుకున్న మాటలు అనుకున్నట్లు రాకపోవచ్చు. నేను అన్న మాటలు వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు నేను చింతిస్తున్నాను.ఎన్టీఆర్ గారి పట్ల మరియు ఆయన అభిమానులందరి పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. సినిమా పట్ల,మీ హీరో పట్ల మీరు చూపే ప్రేమకు నేను నిజంగా విలువ ఇస్తున్నాను. ఇది నేను ఉద్దేశ్యపూర్వకంగా చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ విషయాన్ని అభిమానులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు.

# విడుదలకు ముందే పెద్ది రికార్డులు

## చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్

విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.





# సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్న నవీన్ పోలిశెట్టి?

యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్ లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నాయి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలపనున్నారట. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.




# కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి

ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతు న్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతు న్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి – బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.





## కపర్దేశ్వర స్వామిని దర్శించుకున్న హీరోయిన్ ప్రియాంక మోహన్.....

హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) నవంబర్ 24 :

ప్రముఖ నటి ప్రియాంక మోహన్ స్వయంభు కపర్దేశ్వర స్వామి వారి ని ద దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ప్రియాంకను పూజారులు స్వాగతించి ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అంతకుముందు ఆమె పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ బామిడి అఖిల్, ఘనపాటి బామిడి సీతారామ కృష్ణ దానులను వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం వారి అతిథ్యంలో ఆలయానికి చేరుకొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ప్రియాంక మోహన్ రాకతో ఆలయం పరిశ్రమల్లో సందడి నెలకొంది భక్తులు అభిమానులు ఆమెను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులతో ఫోటోలు దిగుతూ కాసేపు మాట్లాడిన ప్రియాంక అందరి ప్రేమకు కృతజ్ఞతలు తెలిపింది.





# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం

నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈతా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈతా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.

# ఫిబ్రవరి 13న స్వయంభు విడుదల.. భారీ అంచనాలతో నిర్మాణం..




ఒక సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్స్.. వేల సవాళ్లు..' అంటూ 'స్వయంభు' విడుదల తేదీని ప్రకటించారు హీరో 'నిఖిల్'. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల కానున్నట్లు తెలుపుతూ వీడియో విడుదల చేశారు. హీరో నిఖిల్ సిద్దార్థ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంలో ఉన్నారు. అయితే , ఈ రోజు మేకర్స్ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిఖిల్ ఇప్పుడు మళ్లీ పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా వచ్చే ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషలలో మూవీని రిలీజ్ చేయనున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని టీమ్ వెల్లడించింది. విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా, మేకర్స్ 'రైజ్ ఆఫ్ స్వయంభు' అనే స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిత్రంలోని భారీ స్కేల్, యుద్ధ సన్నివేశాలు, పీరియడ్ సెట్లు, నిఖిల్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోతో చిత్రం పై ఉన్న హైప్ మరింత పెరిగింది. త్వరలో ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రంలో సమ్యుక్తా, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఇద్దరి పాత్రలు కూడా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్టు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత టాగూర్ మధు ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ కె.కె. సెంథిల్ కుమార్ కాగా, ఇప్పటికే భారీ చిత్రాలకు కెమెరా వర్క్ అందించిన ఆయన విజువల్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. యుద్ధ నేపథ్యం, భారీ సెట్స్, ఇంటెన్స్ కథ, పాన్–వరల్డ్ విడుదల ..ఈ అంశాలన్నీ కూడి 'స్వయంభు'ను నిఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. విడుదల తేదీ అనౌన్స్‌మెంట్ తర్వాత పోస్టర్లు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2026 ఫిబ్రవరి వరకు కొత్త అప్డేట్లు, పోస్టర్లు, ట్రైలర్లు వరుసగా విడుదలయ్యే అవకాశం ఉంది.


## తిరుచానూరులో అంగరంగ వైభవంగా రథోత్సవం

**- రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం**



**తిరుపతి,నవంబర్24( వెలుతురు):**
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం రథోత్సవం ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలు మంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు. అనంతరం అమ్మవారికి రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి. వీర బ్రహ్మం, సివిఎస్వో కే.వి. మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం



**ముంబయి,నవంబర్24( వెలుతురు):**
ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. ముంబయి నుంచి డెహ్రాడూన్ కు బయల్దేరిన ఇండిగో 6ఇ5032 విమానాన్ని మార్గం మధ్యలో ఆకస్మాత్తుగా ఓ పక్షి ఢీకొంది. అప్రమత్తమైన పైలట్.. వెంటనే విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ క్రమంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అయితే.. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ అధికార ప్రతినిధి ఒకరు అధికారికంగా వెల్లడించారు. ఆ సమయంలో విమానంలో సుమారు 186 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ప్రత్యామ్నాయంగా మరో విమానం ద్వారా సర్వీసును పునరుద్ధరించింది ఎయిర్‌ఇండియా. ఈ స్వల్ప విరామంలో ప్రయాణికులకు విమానయాన సిబ్బంది అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.

## డాక్టర్‌కు వీసా నిరాకరణతో ఆత్మహత్య



**హైదరాబాద్, నవంబర్24( వెలుతురు):**
వీసా రాకపోవడంతో ఓ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాద్ పద్మారావు నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్ది రోజుల క్రితం డాక్టర్ రోహిణికి వీసా నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె మనస్థాపం చెంది నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రోహిణి గదిలో సూసైడ్ నోట్ లభ్యమైంది. వైద్యురాలు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోహిణి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుంటూరులో ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు.

## మా అమ్మ క్షేమంగానే ఉన్నారు

**ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నాం: సిఎం రమేశం**



**హైదరాబాద్,నవంబర్24( వెలుతురు):**
తన తల్లి చింతకుంట రత్నమ్మ ఆరోగ్య పరిస్థితిపై దుష్ప్రచారం జరుగుతోందని.. ఈ వార్తలను ఎవరూ నమ్మవద్దని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ రమేశ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కొన్ని వార్త పత్రికల్లో, వాట్సాప్ గ్రూపుల్లో తన తల్లి స్వర్గస్తులు అయ్యారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని వాపోయారు. దయచేసి ఎవరూ అలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని విన్నవించారు. తన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, ఆమెకు నిరంతరం వైద్యులు చికిత్స అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ కుటుంబం తరపున అందరూ చేస్తున్న ప్రార్థనలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని అనకాపల్లి ఎంపీ రమేష్ పేర్కొన్నారు.

# స్మృతి మంధాన తండ్రి క్షేమం

**- స్వల్ప అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిపలాశ్**
**- డిశ్చార్జ్ అయినట్లు సన్నిహితుల వెల్లడి**

**న్యూఢిల్లీ,నవంబర్24( వెలుతురు):**
భారత మహిళా స్టార్ ప్లేయర్ స్మృతి మందాన వివాహం చివరి నిమిషంలో వాయిదా పడింది. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ తో స్మృతి వివాహం ఆదివారం సాయంత్రం జరగాల్సి ఉండగా అనూహ్యంగా వాయిదాపడింది. ఉదయం ఆమె తండ్రి శ్రీనివాస్ మందాన గుండెపోటుకు గురయ్యారు. దీంతో పెళ్లి వాయిదా పడింది. ఈ షాక్ లో ఉన్న స్మృతికి మరో షాక్ తగిలింది. ఆమెకు కాబోయే భర్త పలాశ్ కూడా అనారోగ్యానికి గురయ్యారు. పలాశ్ ముచ్చల్ వైరల్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. దీనితో పాటు ఎసిడిటీ పెరిగినట్లు ఆయన స్నేహితులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చికిత్స తర్వాత పలాశ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం స్మృతి మందాన



తండ్రి శ్రీనివాస్ మందాన సాంగ్లీలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొన్ని రోజుల కిందటే మందాన వివాహ వేడుకలు మొదలయ్యాయి. మెహందీ, హల్దీ, సంగీత్ కార్యక్రమాలు నిర్వహించారు. స్మృతి తండ్రి పూర్తిస్థాయిలో కోలుకునేదాకా ఆమె తన వివాహాన్ని వాయిదావేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. చికిత్స అనంతరం అతడు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి

**- కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స**

**ముంబై,నవంబర్24( వెలుతురు):**
భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్నుమూశారు. సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. 89 ఏండ్ల ధర్మేంద్ర గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పది రోజుల క్రితం ముంబై లోని క్యాండి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అప్పటినుంచి ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకూ ధర్మేంద్ర వెంటిలేటర్‌పై ఉన్నారంటూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. 1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో 'షోలే', 'చుప్కే చుప్కే', 'ధర్మ్ వీర్', 'సీతా ఔర్ గీత', 'యాదోం కి బారాత్' వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు 'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్' అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం 'ఇక్కీస్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో



కనిపించనున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఇదిలావుంటే బాలీవుడ్ స్టార్ ధర్మేంద్ర అంత్యక్రియలను అత్యంత గోప్యంగా నిర్వహించారు. ముంబైలోని పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు చేపట్టారు. వార్త తెలిసన వెంటనే ధర్మేంద్ర భార్య , ప్రఖ్యాత నటి హేమామాలిని, ధర్మేంద్ర కుమార్తె ఈషా డియోల్.. శ్మశానవాటికకు చేరుకున్నారు.

# తిరుమల ఘాట్ రోడ్డు కారు బోల్తా

**- స్వల్ప గాయాలతో బయటపడ్డ భక్తులు**



**తిరుమల,నవంబర్24( వెలుతురు):**
తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. బ్రేకులు ఫెయిల్ కావడంతో కారు బోల్తాపడి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారులోని భక్తులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలుస్తోంది. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని రెండో కిలోమీటర్ మైలురాయికి సమీపంలో ఈ ఘటన జరిగింది. కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పిన కారు పక్కన ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టి తలకిందులుగా పడిపోయింది. కారులో ఉన్న నలుగురు ప్రయాణికులను తమిళనాడుకు చెందిన భక్తులుగా గుర్తించారు. అయితే కారులో వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కారు బోల్తా పడి రోడ్డుకు అడ్డంగా ఉండటంతో తిరుమల వెళ్లే భక్తుల వాహనాలకు మరింత ఆలస్యం ఏర్పడింది. ఈ ఘటనపై స్పందించిన అధికారులు వెంటనే ట్రాఫిక్ సమస్యను తీర్చారు. గాయపడిన భక్తులను ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. కారు బోల్తా పడింది. బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. దీనంతో ఘాట్ రోడ్డు పై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కారులో తమిళనాడు భక్తులు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. కారులోని వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.








Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com